# వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026' ఆహ్వానం అంద జేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.

- హైదరాబాద్,ఫిబ్రవరి10 (నినాదం)


# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం 11 ఫిబ్రవరి 2026 | సంపుటి: 22 | సంచిక: 125 | వెల: రూ.7 | పేజీలు: 12+8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


ఎన్నికలకు ఒకరోజు ముందు

## అనూహ్య ఘటన

**మక్తల్ ఆరోవార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య**

- ఘటనకు కాంగ్రెస్ కారణమని మండిపడ్డ బీజేపీ
- పార్లమెంటులో ప్రస్తావించిన కిషన్ రెడ్డి, లక్ష్మణ్



మహదేవప్ప మృతికి రేవంత్‌దే బాధ్యత

మండిపడ్డ కిషన్ రెడ్డి

2

ఎన్నికల ప్రాంతాల్లో

## నేడు సెలవు

- ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు
- ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు వర్తింపు

2

## ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది

**బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు!.. ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారో ఆరా తీస్తున్నాం**

- మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు
- పుర పోరులో కాంగ్రెస్ ప్రభంజనం..
- 80 శాతం పైగా స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం

2



40 ఏళ్ల నిజాయితీకి


# పుర పరీక్ష

**ఆత్మాభిమానమా..? అవకాశవాదమా?**

**ధర్మానికి.. అధర్మానికి.. మధ్య ఓటరు..!**

జగిత్యాల ఉద్యమాల గడ్డ..ఇప్పుడు రాజకీయ ఊసరవెల్లులకు అడ్డాగా మారింది. దిగజారుడు రాజకీయాలతో జగిత్యాల ఔన్నత్యానికి మకిలి పట్టించారు. 40 ఏళ్ల ప్రాతివత్యం.. ఉంపుడు గత్తె ముందు చేష్టలుడిగి నిలబడింది.. నీతి, నిజాయితీ, ధర్మం అపహాస్యమౌతుంది, అధర్మం రంకె లేస్తుంది. ధన దాహం వికట్టహాసం చేస్తుంది. ధర్మం దిక్కులేనిది అయి చౌరస్తాలో నిలబడింది. గాలిలో పదవులు పొందిన ముఖ్య నేతలు అధర్మం తో అంట కాగుతున్నారు. పురపోరులో ఒంటరైన నిజాయితీ న్యాయం చేయమని ప్రజాక్షేత్రంలో ఇల్లు ఇల్లు తిరిగి కొంగుచాపి అడుక్కుంటుంది. దిగజారుడు రాజకీయాలతో జగిత్యాల నియోజకవర్గం ను భ్రష్టు పట్టించిన దుష్ట రాజకీయ శక్తులను నిలువరింపజేసే సత్తా పట్టణ ఓటర్ల చేతిలో ఉంది. నిజాయితీని బతికించండి రాజ్యాంగాన్ని కాపాడండి ఓటుతో తులాభారాన్ని సరి చేయండి.

– **జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 10 (నినాదం):**




**నీతిగల నేతకు అగ్నిపరీక్ష..!**

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో జగిత్యాల నియోజకవర్గంకు అత్యంత ప్రత్యేకత, చరిత్ర ఉంది.చరిత్రపుటల్లో ఒళ్ళు జలదరించే ఉద్యమాల పేజీలు ఉన్నాయి. ఇంతటి ఔన్నత్యంగా ఉన్న జగిత్యాలను వ్యభిచార రాజకీయాలకు అడ్డగా మార్చారు. అవకాశాలు ఎన్ని వచ్చినా నైతిక విలువలకు పెద్దపీట వేసి ఒకే పార్టీ నమ్ముకుని విలువలతో రాజకీయం చేసిన తాటిపర్తి జీవన్ రెడ్డి చుట్టూ అవినీతి కంచవేశారు. మున్సిపల్ కురుక్షేత్రంలో జీవన్ రెడ్డికి అవినీతి పద్మవ్యూహం గీసి రాజకీయంగా ...మిగతా 2లో

# నేడు మున్సిపల్ ఎన్నికలు

**రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్**

- భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసుల భద్రత
- మక్తల్ ఆరోవార్డు బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా




తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరుగ నున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణపేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్టు తెలిపింది.

- **హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నినాదం)**

### పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**మూడు వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు**

**డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి**

2






రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్

## ఆపడం సరికాదు

- వారికి బకాయిలు వెంటనే చెల్లించండి
- సీఎం రేవంత్ కు బండి సంజయ్ లేఖ



2



అక్రమంగా కృష్ణా నీటిని

## తరలిస్తున్న ఆంధ్రా

**చోద్యం చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి**

బాబుకు గురు దక్షిణ సమర్పిస్తున్నట్లుగా ఉంది మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు

2



స్పీకర్ ఓంబిర్లాపై

## అవిశ్వాసం

**నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ తదితర పార్టీలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (నినాదం):** లోకసేభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోకసేభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై ...మిగతా 2లో

## అమరావతికి చట్టబద్ధత?

**కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో చంద్రబాబు చర్చ**

**నిధుల విడుదల కోసం నిర్మలా సీతారామన్‌తో భేటీ**



2

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై ఆయనతో చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాబడ్జెబ్జెట్ రెండో దశ సమావేశాల్లో బిల్లు పెట్టాలని అమిత్‌షాను సీఎం కోరినట్లు సమాచారం.

- **న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (నినాదం)**

## హెచ్-1బీ వీసా రద్దుకు బిల్లు!

అమెరికాలో నివసిస్తూ ఉద్యోగాలు చేస్తున్న వేలాది మంది భారతీయ ఐటీ నిపుణులకు షాకిచ్చేలా అక్కడి చట్టసభలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఫ్లోరిడాకు చెందిన రిపబ్లికన్ ప్రతినిధి గ్రెగ్ స్టూబ్ ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. – **న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (నినాదం)**




2






# వృధా అవుతున్న మంజీరా జల.. జీవధార

**నదిని తలపిస్తున్న చెన్నాపురం రోడ్డు**
**నీటి వృధాను అరికట్టాలని ప్రజల వేడుకోలు**

**జవహర్ నగర్, ఫిబ్రవరి 10 (నినాదం) :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని జిహెచ్ఎంసి జవహర్ నగర్ చెన్నాపురం చౌరస్తాలో మంగళవారం మంచినీటి పైప్ లైన్ లీక్ అయి భారీ ఎత్తున మంచినీరు వృధా అవుతున్నా పట్టించుకోని జలమండలి అధికారులు. ఈ సందర్భంగా చెన్నాపురం వాసులు మీడియాతో మాట్లాడుతూ మంజీరా నీరు భారీ ఎత్తున వృధా అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్ నగర్లో అసలేనీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా మురికినీటి బోర్డు (హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి) అధికారులు నిర్లక్ష్యంతో అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అసలే ఎండాకాలం సమీపిస్తుండగా దీనికి తోడు జవహర్ నగర్ లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా వీటికి తోడు తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డచందంగా నీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా అధికారుల నిర్లక్ష్యం వల్ల మంచినీరు వృధాగా పోవడం బాధాకరం. మంగళవారం చెన్నపురం చౌరస్తాలో మంజీరా పైప్లైన్ లీకై పెద్ద ఎత్తున నీరు వృధా కావడం ప్రజలకు తాగునీరు దొరకక ఇబ్బందులు పడుతుంటే అధికారుల అలసత్వం వల్ల నీరు వృధా పోవడం శోచనీయమని చెన్నాపురం ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి భవిష్యత్తులో నీటి వృధాను అరికట్టాలని శాశ్విత చర్యలు తీసుకొని మంజీరా నీరు వృధాగా పోకుండా శాశ్విత చర్యలు తీసుకోవాలని జవహర్ నగర్ ప్రజలు వేడుకుంటున్నారు.

## దేశంలోనే డిజిటల్ లావాదేవీలలో
# తెలంగాణ ప్రథమ స్థానం

**ఆర్బిఐ ఏజీఎం రాములు**



**మహాదేవపూర్ ఫిబ్రవరి10 (నినాదం):** దేశంలోనే డిజిటల్ లావాదేవీలల్లో తెలంగాణా ప్రథమ స్థానంలో ఉందని ఆర్బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాములు అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాల పల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈడీ సెల్ కన్వీనర్ డాక్టర్ మాధవి, వంగపల్లి పరశురాములు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం రాములు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏజీఎం రాములు మాట్లాడుతూ దేశంలోనే డిజిటల్ లావాదేవీలు తెలంగాణా లో ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. డిజిటల్ లావాదేవీలు ఉపయోగించడంలో దేశంలోనే తెలంగాణా ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు. సైబర్ నేరగాళ్లు కూడా అదే క్రమంలో మోసం చేయడానికి ప్రయత్నిస్తారని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు కేవైసీని బ్యాంకుతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తగా ఉండాలని సైబర్ నేరగాళ్లు ఫోను ద్వారా సంప్రదించి మీ యొక్క వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్ కు సంబంధించిన ఓటిపి,తదితర వివరాలు అడిగినప్పుడు చెప్పకూడదని అలాగే ఏపీకే ఫైల్స్ ఎవరు ఓపెన్ చేయకూడదని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్లకు చిక్కినట్లయితే వెంటనే 1930 ఫోన్ చేసి సంబంధిత బ్యాంకులో సమాచారం ఇవ్వాలని సైబర్ క్రైమ్ బ్రాంచ్ ను సంప్రదించాలని సూచించారు.లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ ఆఫీసర్ తిరుపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసిన క్రమంలో మీ యొక్క నామిని వివరాలు కూడా సంబంధిత పత్రంలో పొందుపరచాలని లేనియెడల అనివార్య కారణాల వలన ఖాతాదారునికి ఏమైనా జరిగితే వారి యొక్క లావాదేవీలు నిలుపుదల చేయబడతా యన్నారు. లోన్స్ కు సంబంధించిన ఏమైనా ఇబ్బందులు కలిగినట్లయితే జిల్లా కార్యాలయంలో తనను సంప్ర దిస్తే సరైన పరిష్కారం చూపిస్తానని అన్నారు.విద్యార్థులకు ఆర్థిక అక్షరా స్యత పై అవగాహన కలిగించి చైతన్య పరిచిన బ్యాంకు అధికారులను అభి నందిస్తూ శాలువాలతో సన్మానిం చారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజు, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనే జర్ వినీత్, లీడ్ బ్యాంక్ కౌన్సిలర్లు కళాశాల అధ్యాప కులు పాల్గొన్నారు. విద్యార్థులందరికీ స్టీల్ వాటర్ బాటిల్ ఉచితంగా అందజేశారు.

# మధుర జ్ఞాపకాలను మిగిల్చిన అల్ఫోర్స్ వీడ్కోలు వేడుకలు



**కరీంనగర్, ఫిబ్రవరి 10(నినాదం) :** విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను సమగ్రంగా సాధన చేస్తే ఏర్పరచుకున్నటువంటి లక్ష్యాలను సాధించి తల్లిదండ్రుల యొక్క కీర్తి ప్రతిష్టలను రెట్టింపు చేయాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కరీంనగర్ శివారులో గల ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందినటువంటి 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రారంభానికి ముందు సరస్వతి మాతకు పూజ ఆచరించి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ పాటించడమే కాకుండా అమలు పరచాలని తద్వారా వారికి ప్రత్యేకమైన గుర్తింపు రావడమే కాకుండా ఉపాధ్యాయులు సైతం అన్ని వేళల్లో సహాయ సహకారాలు అందిస్తారని, పలు విషయాలలో నిపుణులుగా తయారుచేస్తారని వారు చెప్పారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాలని మరియు ఆ ప్రోత్సాహంతో, ఏర్పరచుకున్నటువంటి లక్ష్యాలను చాలా సులభంగా చేదించగలుగుతారని అభిప్రాయ పడ్డారు. రానున్నటువంటి 10వ తరగతి పరీక్షల్లో జాతీయస్థాయిలో ప్రతిభను చాటి అత్యుత్తమ మార్కులను సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేటు వంటి ఈ పరీక్షల్లో ప్రతిభ చాటిన వారికి చాలా అవకాశాలు ఉంటాయని మరియు ఉపకార వేతనాలను సైతం మ పొందవచ్చని వారు చెప్పారు. అన్ని విషయాలలో ఉత్సాహ పరుస్తూ చదువులో రాణింప చేస్తున్న ఉపాధ్యా యులను సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారమిత స్కూల్‌లో అంబరాన్నంటిన
# మైత్రేయ వీడ్కోలు సంబరాలు




**కరీంనగర్, ఫిబ్రవరి 10(నినాదం) :** స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ సి.బి.యస్.ఈ. స్కూల్లో పదవ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన మైత్రేయ వీడ్కోలు సంబరాలు అంబరాన్నంటాయి. పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి వీడ్కోలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతీ య సంప్రదాయం ప్రకారం వెలిగించిన ఆ దీపం, విద్యార్థులు భవిష్యత్తు కూడా అంతే ఉజ్వలంగా ఉన్నతస్థాయిలో ముందుకువెళ్లాలని ఆకాంక్షించారు. .ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, కేవలం పుస్తక జ్ఞానం, మార్కులే జీవితం కాదని, విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని కూడా ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గత 11 సంవత్సరాలుగా పారమి తలో విద్యనభ్యసించిన విద్యార్థులు.. నైతిక విలువలు, స్వీయ క్రమశిక్షణ, ఆత్మ నియంత్రణ వంటి ఉత్తమ లక్షణాలను పెంపొందించుకోవడం అభినందనీయమని కొనియాడారు. రేపటి సమాజంలో సవాళ్లను ఎదుర్కోవడానికి ఈ విలువలనే ఆయుధాలుగా చేసు కోవాలని ఆయన పిలుపునిచ్చారు. దాదాపు ఒక దశాబ్ద కాలం పాటు ఒకే గొడుగు కింద కలిసి చదువుకున్న విద్యార్థులు, పాఠశాలను వీడి వెళ్తున్న తరుణంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆటపాటలు, పరీక్షలు, ఉపాధ్యాయుల మందలింపులు, స్నేహితుల ముచ్చట్లు వంటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన ఉపా ధ్యాయులకు, సహకరి ంచిన ఉపాధ్యాయేతర సిబ్బందికి విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞ తలు తెలిపారు. తమ జీవిత ప్రయాణంలో ఉపాధ్యాయుల మార్గదర్శ కత్వం ఎప్పటికీ ఒక దిక్సూచిలా ఉంటుందని వారు భావోద్వేగంతో చాటిచెప్పారు. వీడ్కోలు సభ కేవలం కన్నీటితోనే కాకుండా, విద్యార్థుల నృత్యాలు కేరింతలతో ఉత్సాహంగా సాగింది. తమ సీనియర్లకు వీడ్కోలు పలుకుతూ తొమ్మిదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వారు ప్రదర్శించిన నృత్యాలు, ప్రసంగాలు కార్యక్రమానికి కొత్త మెరుగులు దిద్దాయి. ఈ కార్యక్రమములో పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, వినోద్ రావు, రాకేష్, అనూకర్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంత రావు, ప్రిన్సిపల్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు సర్వం సిద్ధం

**డిస్ట్రిబ్యూషన్‌ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్**



**జమ్మికుంట, ఫిబ్రవరి 10 (నినాదం) :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు గాను సోమవారం వరకు ఎన్నికల ప్రచారం ముగియడంతో మంగళవారం అధికారులు ఎన్నికలకు సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. జమ్మికుంట పట్టణంలోని 30 వార్డులలో కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు 159 మంది ఉండగా మొత్తం ఓటర్లు33 335 మంది ఉన్నారు. వీరికి గాను 60 పోలింగ్ బూత్లను ఏర్పాటు చేయగా 700 మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 192 వచ్చాయని డిస్ట్రిబ్యూషన్ మరియు రిసీవింగ్ కౌంటర్ సెంటర్లను జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది తమ తమ కేంద్రాలకు పోలింగ్ నిర్వహణ సామాగ్రిని తీసుకెళ్లేందుకు డిగ్రీ కళాశాలకు రాగా సందడి నెలకొంది. డిగ్రీ కళాశాల మైదానంలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ అవసరమైన సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ చేశారు. జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకిడే పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సిబ్బందితో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రానికి ప్రతి ఒక్కరూ తమ పూర్తి సామాగ్రిని తీసుకొని వెళ్లడంతో పాటు సీరియల్ నెంబర్ కరెక్ట్ గా ఉందా లేదా చూసుకోవాలన్నారు. పోలింగ్ నిర్వహణలో ఏ విధమైనటువంటి లోపాలు కలగకుండా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు అధికారులకు సమస్యలు ఉన్నట్టయితే తెలియజేయాలని సూచించారు.

## మహేంద్ర హిల్స్‌లో రూ.14 కోట్ల 95 లక్షలతో
# కొనసాగుతున్న రిజర్వాయర్ నిర్మాణ పనులు

**కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్**
**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కార్పొరేట్ మేకల సునీత యాదవ్‌ల ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు ప్రారంభమైన పనులు**





**మల్కాజిగిరి, ఫిబ్రవరి 10 (నినాదం) :** మల్కాజిగిరి సర్కిల్ తో పాటు గౌతమ్ నగర్ డివిజన్ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరిం చేందుకు మహేంద్ర హిల్స్ లో 14 కోట్ల 95 లక్షల రూపాయలతో 5 ఎం ఎల్ రిజర్వాయర్ నిర్మాణ పనులు ఎట్టకేలకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చొరవ తో మంజూరైన రిజర్వాయర్ పనులు ప్రారంభమయ్యాయని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతరాము యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహేంద్ర హిల్స్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయితే గౌతమ్ నగర్ డివిజన్ ప్రజలతోపాటు మల్కాజిగిరి ప్రజలకు 24 గంటలు సస్యశ్యామలంగా మంచినీరు అందుతుందన్నారు. అంతేకాకుండా 5 సంవత్సరాల పరిపాలనలో 72 కోట్ల రూపా యల జిహెచ్ఎంసి నిధులతో గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు తోపాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. 4:30 కోట్ల రూపాయలతో జ్యోతి నగర్, హనుమాన్ పేట్ వద్ద రైల్వే పట్టాల కింద నుండి మురికి కాలువ పనులు పూర్తి చేశామని, ఈ మౌలిక వసతులు... మల్కాజిగిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి చెరువుతో జరిగాయని, ఇందిరా నెహ్రూ నగర్ లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాల తెలిపారు.

## భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను
# ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్



**మారుతి నగర్‌లో శివాజీ విగ్రహం ఆవిష్కరణ.. అన్నదానం కార్యక్రమం**



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 10 (నినాదం) :** మల్కాజి గిరి సర్కిల్ ఆనంద్ బాగ్ లోని అష్టభుజాదేవి ఆలయం వద్ద మంగళవారం స్ట్రీట్ నెంబర్ 22లో భూగర్భ డ్రైనేజీ పనులకు, స్ట్రీట్ నెంబర్ 10 లో 20 లక్షల రూపాయల వ్యయం తో భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్డు పనులను మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ జిహెచ్ఎంసి అధికారుల కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శాస్త్రి,మురళీకృష్ణ, నాగేశ్వరావు, పులిపాక రవీందర్, సరిపల్లి శ్రీనివాస్, నందు యాదవ్, మాధవ్ యాదవ్, రవి, శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. మారుతీ నగర్ లో విడుదలవారీగా దాదాపు 45 లక్షల రూపాయలతో నిర్మించినటువంటి శివాజీ పార్క్ నూతన బోర్డు, శివాజీ విగ్రహాన్ని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఆవిష్కరించారు. అనంతరం మారుతీ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కు నిర్మాణానికి సహకరించిన ఇంజనీరింగ్ అధికారులు నవీన్, రమేష్, రవి, పారిశుద్ధ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హరి గౌడ్, ఆనంద్, జయకృష్ణ, కోటేశ్వరరావు, అంజి,శంకర్, యాకయ్య, సంతోష్ కాలనీవాసులు పాల్గొన్నారు.






# అంగరంగ వైభవంగా బాలయ్య నగర్ శ్రీరేణుక ఎల్లమ్మ దేవి వార్షికోత్సవ వేడుకలు


**కన్నుల పండుగగా అమ్మవారి కళ్యాణ వేడుకలు**
**భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, నిప్పులు తొక్కుట బోనాల సమర్పణ**

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్ లో రెండు దశాబ్దాల క్రితం వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయం కొలిచిన భక్తుల పాలుట కొంగుబంగారమై అమ్మవారి ఆలయం దిన దిన ప్రవర్ధమానమై విరాజిల్లుతున్నది. బాలయ్య నగర్ లో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ 22వ వార్షికోత్సవ వేడుకలు అమ్మవారి కళ్యాణం అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా బాలయ్య నగర్ అభివృద్ధి కమిటీ, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యే క పూజలు నిర్వహించడంతోపాటు కళ్యాణం నిప్పులు తొక్కుట బోనాలు సమర్పణ వంటి కార్యక్రమాలను భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయ వార్షికోత్సవాలకు డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి తో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంతరెడ్డి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఎమ్మెల్యే కేపీ వివేకానందు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆలయాల పరిసరాలను ప్రశాంత వాతావరణముతో పాటు భక్తిని పరవశింపజేసే విధంగా ఉండే విధంగా ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలను తిలకించుటకు వందలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబం పిల్లాపాపలతో సహా ఆయురారోగ్యాలతో ఉండే విధంగా అమ్మవారు చల్లని కరుణను చూపాలని వేడుకుంటూ బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం సాయంత్రం పలహార బండితో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవం కల్యాణ వేడుకలను ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించిన ఆలయ కమిటీ బాలయ్య నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులను నేతలతో పాటు భక్తులు అభినందించారు.




## భక్తితో సమాజంలో
# ఐక్యతను పెంపొందిస్తాయి

**ఎమ్మెల్యే కె.పీ.వివేకానంద**



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద మంగళవారం గాజులారామారం 125వ డివిజన్‌లోని బాలయ్య నగర్‌లో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి 22వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులతో కలసి ఉత్సవాలలో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తితో సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మనసులకు శాంతి, స్ఫూర్తిని ఇస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నగేష్, సాయిలు, గోకుల్ ప్రసాద్, గంగయ్య, సునీల్ కుమార్ వర్మ, పార్వతి, శ్యామ్ సుందర్, చిన్న, గంగారాం మరియు స్థానిక నాయకులు విజయ్ రామ్ రెడ్డి, కస్తూరి బాలరాజు, అడ్వకేట్ కమలాకర్, పరుష శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, సుంకరి చందు, తారా సింగ్, శివ నాయక్, చందు గౌడ్, నవీన్, అసిఫ్, చిన్న చౌదరి, మక్సూద్ భాయ్, గుట్ట వేణు యాదవ్, బౌరంపేట శ్రీనివాస్ రెడ్డి మరియు భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎన్నికలంటే.... డబ్బున్నోళ్ల దందా!

**ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థలదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది. పండగ చేసుకుంటున్నారు.**

ఎడిటోరియల్

ఇంట్లో వంటావార్పులు అంతంత మాత్రమే. రోజుకు ఎవరో ఒకరు రావడం సాయంత్రానికి దావత్ ఇవ్వడం పరిపాటిగా మారింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గత వారం రోజులుగా ఇదే తంతు సాగింది. చివరకు బుధవారం ఎన్నికలు ఉండగా సాయంత్రం కూడా దావత్‌లకు టైమ్ కేటాయించారు. తాగుడు అలవాటు ఉన్నవారికి తాగినంత...తిండి అలవాటున్న వారికి తిన్నంత అన్న లెక్కన సాగడం ప్రజాస్వామ్య పరిహాసాని కి ఎన్నికలు పరాకాష్టగా నిలుస్తున్నాయి. సోమవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ప్రలోభాలకు తెర లేచింది. మద్యం, మాంసంతో పాటు ఇతరత్రా కానుకల పంపిణీ ప్రారంభమైంది. పది రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఆ వెంటనే కొందరు అభ్యర్థులు ఓటర్లపై తాయిలాలు వెదజల్లడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఓ పార్టీ నేతలు ఇంటింటికీ చికెన్ పొట్లాలు పంపించారు. మరో అభ్యర్థి తన వార్డు పరిధిలోని ఓటర్లకు హారతి ప్లేటెం పంపిణీ చేసారు. నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. దాదాపు పది రోజుల పాటు ప్రచారంతో హోరెత్తించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వందల మందిని వెంటేసుకుని గల్లీగల్లీ చుట్టేశారు. పార్టీల నేతలు వార్డుల వారీగా బాధ్యతలు పంచుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రచార పర్వం ముగియడంతో అన్ని పార్టీల నేతలు ప్రలోభాలకు తెర లేపారు. ఉదయమే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో విచ్చలవిడిగా తాయిలాలు వెదజల్లాయి. చికెన్ వద్దు అన్నవారికి అరకిలో మటన్‌ను పంపించారు. గత రెండ్రోజులుగా మద్యం సీసాలు, కూల్ డ్రింకలు సరఫరా చేశారు. వీటికి అదనంగా రాత్రిపూట డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.3 వేలు ఇచ్చినట్లు సమాచారం. కొన్ని పట్టణాల్లో ఖరీదు కూడా పెంచారు. డివిజన్లు, వార్డుల్లో మద్యం ఏరులై పారుతుండగా, మరోపక్క డబ్బుల పంపకాలు జోరందుకున్నాయి. ఇక, ప్రత్యర్థి ఎంత పంచుతున్నాడు.. అని అంచనా వేస్తూ అంతకుమించి ఓటర్లను ఇవ్వటానికి ఎత్తులు వేయడంలో అభ్యర్థులు తలమునకలయ్యారు. ఇలా యథేచ్ఛగా పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారుల దృష్టిలో మాత్రం పడలేదు. అయితే పరస్పరం ఆయా పార్టీల వారు మాO-తరం ఆరోపణలు చేసుకున్నారు. ఫలానా పార్టీవారు డబ్బులు పంచుతున్నారంటూ నిందలు వేసారు. స్థానిక నేతల అండతో విచ్చలవిడిగా మద్యం, డబ్బులను పంపిణీ చేస్తుంటే, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ఒక ఎత్తయితే...ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపు కోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాటు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతు న్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు. వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గెలుపు టెన్షన్‌తో పాటు చైర్మన్ సీటు దక్కుతుందా అనే ఉత్కంఠలో ఉన్నారు. ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల ప్రచారంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో పురపాలికల్లో చైర్మన్ సీటుపై ఆశతో ఆశావహులు భారీగా ఖర్చు పెట్టారు. తన గెలుపుతో పాటు తన పార్టీకి చెందిన వార్డు సభ్యుల గెలుపుకు కూడా వారి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఆశావహులు అన్నితామై వ్యవహరించారు. అయితే ఇన్నీ చేసిన చివరికి పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయా.. తానే పార్టీ అభ్యర్థిని అవుతానా అనే టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎత్తులు, పైఎత్తులు పూర్తయ్యాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారాఓ చూడాలి. గత సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓటేయలేదని నిలదీసారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని నడిబజారులు పసుపుబియ్యంతో తిరిగారు. ఈ ఎన్నికల్లో అలాంటి విచిత్రాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో. ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.

# మున్సిపల్ సమరం: పోలింగ్ రోజు వ్యూహాల యుద్ధం

## బూత్ స్థాయి బరిలో ప్రధాన పార్టీల బలపరీక్ష

నేడు మున్సిపల్ పోలింగ్ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు మరొకసారి ఉత్కంఠ భరిత దశలోకి ప్రవేశించాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా పట్టణ పాలనకు సంబంధించినవిగా కనిపించినా, వాస్తవానికి ఇవి రాష్ట్ర స్థాయి రాజకీయాలపై ప్రభావం చూపే కీలక సమరాలుగా మారాయి. మున్సిపల్ ఎన్నికలు ప్రజల దైనందిన జీవితాలకు అత్యంత సమీపంగా ఉండే పరిపాలనా వ్యవస్థకు ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ కావడంతో, ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ రోజున పోల్ మేనేజ్‌మెంట్, వనరుల వినియోగం, ఓటర్ల మొగ్గును ప్రభావితం చేసే వ్యూహాలు అన్నీ ఒకేసారి కేంద్రీకృతమై కనిపిస్తాయి.

మున్సిపల్ ఎన్నికల పూర్వాపరాలను పరిశీలిస్తే, పట్టణీకరణ వేగవంతమైన కొద్దీ స్థానిక సంస్థల ప్రాధాన్యం గణనీయంగా పెరిగింది. జనాభా పెరుగుదల, పట్టణ సేవలపై ఒత్తిడి, మౌలిక వసతుల విస్తరణ అవసరం వంటి అంశాలు మున్సిపల్ పాలనను రాజకీయంగా కీలకంగా మార్చాయి. గత రెండు దశాబ్దాల్లో పట్టణ జనాభా శాతం నిరంతరం పెరుగుతూ రావడం వల్ల, మున్సిపల్ సంస్థలు కేవలం చెత్త సేకరణ లేదా రహదారుల మరమ్మతులకే పరిమితం కాకుండా, పట్టణాభివృద్ధి, పన్నుల సేకరణ, పౌర సేవల డిజిటలైజేషన్ వంటి విస్తృత బాధ్యతలను చేపట్టాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పట్టణ ఓటర్ల రాజకీయ దృక్పథాన్ని ప్రతిబింబించే సూచికలుగా మారాయి.

పోలింగ్ రోజున ప్రధానంగా చర్చకు వచ్చే అంశం పోల్ మేనేజ్‌మెంట్. ఇది కేవలం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే కాదు; బూత్ స్థాయి వ్యూహాల సమన్వయం, కార్యకర్తల నియోజకవర్గ వారీ చురుకుదనం, ఓటర్ల జాబితాల పరిశీలన, చివరి నిమిషం సంప్రదింపులు వంటి అనేక అంశాల సమ్మిళితం. ప్రతి ప్రధాన పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, ఓటర్ల సామాజిక, ఆర్థిక నేపథ్యాలను విశ్లేషిస్తూ మైక్రో స్థాయిలో ప్రణాళికలు రూపొందిస్తుంది. పోలింగ్ రోజున ఉదయం నుంచే ఓటింగ్ శాతం ఎలా పెరుగుతోంది, ఏ వార్డుల్లో ఓటింగ్ మందగిస్తోంది వంటి వివరాలను సమయానుకూలంగా విశ్లేషిస్తూ వ్యూహాలను మార్చడం ఆధునిక పోల్ మేనేజ్‌మెంట్‌లో కీలక భాగంగా మారింది.

ప్రధాన పార్టీల పోరు ఈ ఎన్నికల్లో బహుముఖంగా కనిపిస్తుంది. అధికార పార్టీ తన పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన అజెండాగా ప్రస్తావిస్తూ పట్టణ ఓటర్ల విశ్వాసాన్ని నిలబెట్టు కునేందుకు ప్రయత్నిస్తుంది. ప్రతిపక్షాలు మాత్రం స్థానిక సమస్యలు, పన్నుల భారం, మౌలిక వసతుల లోపాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ వ్యతిరేకతను సమీకరించేందుకు కృషి చేస్తాయి. మున్సిపల్ ఎన్నికల ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిచయాలు, సామాజిక వలయాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల పార్టీ చిహ్నం ఎంత ముఖ్యమో, అభ్యర్థి స్థానిక ప్రాతినిధ్యం కూడా అంతే ప్రాముఖ్యతను సంతరించు కుంటుంది.

ఓట్లను అనుకూలంగా మలచు కోవడానికి ఎత్తుకు పై ఎత్తులు వేయడం ఎన్నికల రాజకీయాల్లో కొత్త విషయం కాదు. అయితే ఇటీవలి కాలంలో ఈ వ్యూహాలు మరింత వ్యవస్థీకృత రూపం దాల్చాయి. డేటా ఆధారిత ప్రచారం, ఓటర్ల విభజన, లక్ష్యిత కమ్యూనికేషన్ వంటి పద్ధతులు పట్టణ ఎన్నికల్లో విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపులు, స్థానిక ప్రభావశీలుల ద్వారా సందేశాల వ్యాప్తి వంటి మార్గాలు పోలింగ్ రోజుకూడా చురుకుగా కొనసాగుతాయి. చివరి నిమిషం వరకు ఓటర్లను ప్రభావితం చేయాలనే ప్రయత్నం ప్రతి పార్టీలోనూ స్పష్టంగా కనిపిస్తుంది.

వనరుల వినియోగం కూడా మున్సిపల్ ఎన్నికల్లో కీలక అంశం. మానవ వనరులు, ప్రచార సామగ్రి, రవాణా సౌకర్యాలు, డిజిటల్ కమ్యూనికేషన్—కలిసి ఒక సమగ్ర ఎన్నికల యంత్రాంగాన్ని నిర్మిస్తాయి. బూత్ స్థాయిలో కార్యకర్తల మోహరింపు, ఓటర్ల రాకపోకలకు సహకారం, ఎన్నికల నిబంధనలకు లోబడి




నిర్వహించే సమన్వయం— ఇవి పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగం. ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు అమలు చేస్తున్న నేపథ్యంలో, ప్రతి పార్టీ తన వ్యూహాలను చట్టబద్ధ పరిధిలోనే అమలు చేయాల్సిన అవసరం పెరిగింది.

గణాంకాల పరంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం సాధారణంగా రాష్ట్ర లేదా జాతీయ ఎన్నికలతో పోలిస్తే కొద్దిగా తక్కువగా ఉండే ధోరణి కనిపించినా, పట్టణాల్లో స్థానిక సమస్యలు ముదిరినప్పుడు ఓటర్ల చురుకుదనం పెరుగుతుంది. మహిళలు, యువత, మధ్యతరగతి ఓటర్ల భాగస్వామ్యం పెరగడం పట్టణ ఎన్నికలలో ఒక ముఖ్య లక్షణంగా మారింది. స్వయం సహాయక సంఘాలు, కాలనీ సంఘాలు, వృత్తి వర్గాల సమీకరణ కూడా ఓటింగ్ సరళిపై ప్రభావం చూపుతుంది.

ప్రధాన పార్టీల అవకాశాలను విశ్లేషించినప్పుడు స్థానిక రాజకీయ సమీకరణలు కీలకంగా మారతాయి. అధికార పార్టీకి పాలనా ప్రయోజనం, అమలు చేసిన సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం కొంత మేర అనుకూల వాతావరణాన్ని కల్పించవచ్చు. అయితే స్థానిక అసంతృప్తి, అభ్యర్థుల ఎంపికపై అసమ్మతి, వర్గపోరు వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ప్రతిపక్షాలకు ప్రజా అసంతృప్తిని సమీకరించే అవకాశం ఉన్నప్పటికీ, బలమైన స్థానిక నాయకత్వం లేకపోతే అది ఓట్లుగా మారడం సవాలుగా మారుతుంది. చిన్న పార్టీలూ, స్వతంత్ర అభ్యర్థులూ కొన్ని వార్డుల్లో కింగ్‌మేకర్ పాత్ర పోషించే పరిస్థితులు కూడా ఉత్పన్నమవుతాయి.

పోలింగ్ రోజున పరిపాలనా యంత్రాంగం పాత్ర అత్యంత కీలకం. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, మైక్రో అబ్జర్వర్లు వంటి చర్యలు అమల్లో ఉంటాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలింగ్ ప్రక్రియ పారదర్శకత పెరిగింది. ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు, సౌకర్యాల కల్పన వంటి చర్యలు పాల్గొనికను పెంచేందుకు దోహద పడుతున్నాయి.

మున్సిపల్ ఎన్నికల విస్తృత ప్రభావాన్ని పరిశీలిస్తే, ఇవి భవిష్యత్తు రాజకీయ ధోరణులకు సూచికలుగా నిలుస్తాయి. పట్టణ ఓటర్ల అభిరుచులు రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. పార్టీలకు ఇది తమ బలాబలాలను అంచనా వేసుకునే అవకాశం కాగా, ప్రజలకు స్థానిక పాలనపై తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచే వేదిక. పోలింగ్ శాతం, వార్డు వారీ ఫలితాలు, ఓట్ల మార్జిన్లు— ఇవి భవిష్యత్తు వ్యూహాల రూపకల్పనకు ఆధారాలుగా మారతాయి.

మొత్తంగా చూస్తే, నేటి మున్సిపల్ పోలింగ్ కేవలం ఓటు హక్కు వినియోగం మాత్రమే కాదు; పట్టణ ప్రజాస్వామ్యానికి ఒక పరీక్ష. ప్రధాన పార్టీల వ్యూహాలు, పోల్ మేనేజ్‌మెంట్ సామర్థ్యం, ఓటర్ల చైతన్యం—కలిసి ఈ ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయి. స్థానిక సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలు ముందుకు రావడం ద్వారా మున్సిపల్ వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది అయిన స్థానిక సంస్థల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తు చేస్తూ, పట్టణ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టంగా నిలుస్తాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# అమ్మవారి సొమ్ముపై సర్కార్ గద్దకాపు!?

## కాసుల వేటలో పాలకులు.. కన్నీటి సంద్రంలో గిరిజన పల్లెలు!

తెలుగు గడ్డపై అడవి తల్లులైన సమ్మక్క-సారలమ్మల మహిమ నేడు ప్రభుత్వాలకు కేవలం కాసుల వర్షం కురిపించే వనరుగా మారిందా? భక్తులు తమ కోర్కెలు తీర్చాలని తల్లుల చెంత సమర్పించుకునే నిలువెత్తు బంగారం, కానుకల వెనుక ఉన్న భక్తిని పాలకులు కేవలం వ్యాపార కోణంలోనే చూస్తున్నారా? ప్రస్తుతం హనుమకొండలో సాగుతున్న కానుకల లెక్కింపు తీరును చూస్తుంటే ఆదివాసీ గడ్డపై జరుగుతున్న నిలువు దోపిడీకి ఇది నిదర్శనంగా కనిపిస్తోంది. కేవలం మొదటి నాలుగు రోజుల లెక్కింపులోనే రికార్డు స్థాయిలో పదకొండు కోట్ల ఎనభై మూడు లక్షల రూపాయల నగదు లభించింది. ఇంకా సగానికి పైగా హుండీల లెక్కింపు బాకీ ఉండటంతో, ఈ ఆదాయం రూ. 15 కోట్ల నుండి రూ. 16 కోట్లు సునాయాసంగా దాటుతుందని అధికారులే అంచనా వేస్తున్నారు. కోట్లాది మంది భక్తులు సమర్పించిన ఈ భారీ సొమ్మును పట్టణాల వైపు తరలిస్తున్న సర్కార్, ఆ దేవతల బిడ్డలైన ఆదివాసీల ఆకలి కేకలను మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

జాతర నిర్వహణ పేరుతో వందల కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నామని డప్పు కొట్టుకుంటున్న పాలకులు, ఆ నిధులన్నీ కేవలం జాతర నాలుగు రోజులు మెరిసిపోయే హంగులకే తగలేస్తున్నారన్నది అక్షర సత్యం. తాత్కాలికంగా వేసే రహదారులు, అలంకరించే విద్యుత్ దీపాలు జాతర ముగియగానే మాయమవుతున్నాయి. కానీ, అడవి బిడ్డల బతుకులు మాత్రం మళ్ళీ చీకట్లోకి జారుకుంటున్నాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి హుండీలు నిండుతున్నాయి, ఆదాయం రికార్డులు తిరగరాస్తోంది, కానీ గిరిజన గూడాల్లో గర్భిణీలు ఆసుపత్రికి వెళ్లాలంటే నేటికీ డోలీలే దిక్కవుతున్నాయి. విద్యా, వైద్య వసతులు లేక గిరిజన పల్లెలు విలవిలలాడుతుంటే, జాతర ఆదాయాన్ని ఇతర అవసరాలకు మళ్ళించడం ఆదివాసీ సమాజానికి జరుగుతున్న ఘోర అవమానం. ప్రభుత్వం కేటాయిస్తున్నామని చెబుతున్న 150 కోట్లు ఎక్కడకు పోతున్నాయి? ఆ నిధులు కాంట్రాక్టర్ల జేబులు నింపడానికా లేక గిరిజన పల్లెల్లో రహదారులు వేయడానికా అన్నది తేలాల్సి ఉంది.

ఈ అన్యాయంపై ఆదివాసీ సంఘాలు నేడు అగ్నిపర్వతంలా రగులుతున్నాయి. రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ, గిరిజన ప్రాంత ఆదాయంపై ప్రభుత్వం పెత్తనం చలాయించడం ఏంటని వారు నిలదీస్తున్నారు. గత సంప్రదాయాలను తుంగలో తొక్కి, ఆదాయమంతా దేవాదాయ శాఖ గుప్పిట్లోకి తీసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్వం జాతర సొమ్ము ఆ



ప్రాంత అభివృద్ధికి, గిరిజనుల అవసరాలకు వాడేవారని, కానీ ఇప్పుడు అన్నీ మారిపోయాయని ఆదివాసీ మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మా భూమి, మా దేవతలు, మా సంస్కృతి.. కానీ సొమ్ము మాత్రం మీకా?" అంటూ పాలకుల తీరును ఎండగడుతున్నారు. హుండీ ఆదాయంలో మూడో వంతు పూజారులకు ఇస్తున్నట్లే, మిగిలిన నిధులను కూడా వేరే ప్రాంతాలకు తరలించకుండా కేవలం మేడారం ప్రాంత అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

ముఖ్యంగా ములుగు జిల్లాలోని గిరిజన పల్లెల్లో శాశ్వత ప్రాతిపదికన అత్యాధునిక వైద్యశాలలు, ఉన్నత విద్యాసంస్థలు నిర్మించే వరకు ఈ పోరాటం ఆగదని ఆదివాసీ మేధావులు హెచ్చరిస్తున్నారు. జాతర సమయంలో మాత్రమే మేడారం వైపు చూసే అధికారులు, మిగిలిన రోజుల్లో ఆ ప్రాంతాన్ని గాలికొదిలేయడం అత్యంత శోచనీయం. ఒకవైపు ప్రభుత్వం గిరిజన సంక్షేమం గురించి గొప్పలు చెబుతూనే, మరోవైపు వారి దేవతల ద్వారా వస్తున్న ఆదాయాన్ని మాత్రం గిరిజనేతర పనులకు మళ్ళించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం. దేవుడి పేరిట వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి వాడుకోవడం అంటే భక్తుల విశ్వాసంతో ఆటలాడుకోవడమే. జాతర ఆదాయం వల్ల ములుగు జిల్లాలో ఒక్కటంటే ఒక్కటైనా అత్యాధునిక వైద్యశాల కట్టారా అని గిరిజన బిడ్డలు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వానికి హుండీ సొమ్ము మీద ఉన్న శ్రద్ధ, ఆ గూడాల్లోని గిరిజనుల ప్రాణాల మీద లేకపోవడం దురదృష్టకరం. కేవలం నాలుగు రోజుల్లోనే 11.83 కోట్లు దాటిన ఆదాయం, లెక్కింపు పూర్తయ్యేసరికి 16 కోట్లకు చేరడం ఖాయమని అధికారులు సంబరపడుతున్నారు.

కానీ ఆ సంబరం ఆదివాసీల కళ్లల్లో ఎందుకు కనిపించడం లేదు? ఎందుకంటే ఆ నిధులు వారి తలరాతను మార్చలేవని వారికి తెలుసు. సంప్రదాయం ప్రకారం నిధులను కేటాయించి, గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోంది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ మరియు పెసా చట్టం ప్రకారం ఆదివాసీ ప్రాంతాల ఆదాయంపై గ్రామసభలకే నిర్ణయాధికారం ఉండాలి. కానీ సర్కార్ ఈ చట్టాలను తుంగలో తొక్కి పెత్తనం చేస్తోంది.

మేడారం జాతర కేవలం ఒక పండుగ కాదు, అది అడవి బిడ్డల ప్రాణం. అక్కడ భక్తులు సమర్పించే ప్రతి రూపాయిలోనూ ఒక ఆర్తి ఉంటుంది. ఆ సొమ్మును కేవలం గణాంకాలుగా మార్చి ఇతర ఆలయాలకో, ప్రభుత్వ ఖర్చులకో మళ్ళించడం ధర్మం అనిపించుకోదు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి, అమ్మవారి సొమ్మును గిరిజన బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం మళ్ళించేలా తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలి. లేనిపక్షంలో, అడవి బిడ్డల ఆగ్రహానికి పాలకులు మూల్యం చెల్లించక తప్పదని గిరిజన సంఘాలు హెచ్చరిస్తున్నాయి. హుండీ సొమ్ము అడవి తల్లుల బిడ్డల కన్నీళ్లు తుడవడానికి ఉపయోగపడాలి గానీ, పాలకుల విలాసాలకు వనరుగా మారకూడదు. ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, జాతర ఆదాయాన్ని నేరుగా ఐటీడీఏ (ITDA) ద్వారా గిరిజన సంక్షేమానికి ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే మేడారం మహాజాతరకు, భక్తుల భక్తికి నిజమైన గౌరవం లభిస్తుంది. సర్కార్ తన వ్యాపార బుద్ధిని మానుకుని, ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడాలని తెలంగాణ సమాజం ముక్తకంఠంతో కోరుతోంది. కోట్లాది రూపాయల నిధులు గాలిలో కలిసిపోకుండా, మారుమూల గిరిజన పల్లెల్లో కనీస వసతులు కల్పించేలా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అడవి తల్లుల తీర్పు ఎప్పుడూ న్యాయంగానే ఉంటుంది, పాలకులు ఆ న్యాయాన్ని గౌరవిస్తారని ఆశిద్దాం.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863

# వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వండి

## కమ్యూనిటీ ఫార్మింగ్‌కు నిధులు విడుదల చేయాలి

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్‌కు సిఎం చంద్రబాబు వినతి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10 (నినాదం):**

దిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్‌ను విస్తరించడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించడం వల్ల అందించే ప్రోత్సాహకాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.216 కోట్లు ఇవ్వాలని కోరారు. 2024-25లో సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నామని.. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులు 8 లక్షల హెక్టార్లలో సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతూ సమ్మతి తెలిపారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి సాగు అభివృద్ధి చేయడానికి రూ.200 కోట్ల మేర సాయం చేయాలని కోరారు. కోకోనట్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, కర్ణాటక తరహాలో మోడ్రన్ టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు అధునాతన పద్ధతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో మఖానా డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కొల్లేరు సరస్సు ప్రాంతంలో 50వేల ఎకరాల్లో మఖానా సాగుకు అనుకూల వాతావరణం ఉందని, అవసరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.




దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా 10 శాతం ఉందని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారుతోందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నారు. రాష్ట్రంలో జీడిపప్పు, కాఫీ, కోకో, కొబ్బరి ఎక్కువగా పండుతోందని, రైతులకు మద్దతు ధర దక్కేలా చూస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఏపీ పాత్ర కీలకమన్నారు. ఏపీ వ్యవసాయాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇందు కోసం కేంద్రం ప్రత్యేక బృందాన్ని నియమించిందని చెప్పారు. కేంద్ర పథకాలు, సాంకేతికత విషయంలో ఏపీకి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మత్స్యరంగం, పశుపోషణ అభివృద్ధికి సాయం చేస్తున్నట్టు చెప్పారు. సేంద్రియ సాగు, పామాయిల్ ఉత్పత్తిలో ఏపీ బాగా పనిచేస్తోందన్నారు.

### తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం

# సిట్ విచారణతో రంగంలోకి దిగిన ఈడీ

**తిరుమల, ఫిబ్రవరి 10 (నినాదం):**

శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై



ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ ట్రయల్‌పైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

# ఇప్పుడు కెనడా వంతు

## ఇరుదేశాల మధ్య వంతెనపై ట్రంప్ పేచీ

**వాషింగ్టన్, ఫిబ్రవరి 10 (నినాదం):**

కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకు పడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెన ను బ్లాక చేస్తామని బెదిరించారు. 2014 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ విమర్శించారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు ఆమోదయోగ్యమైన రీతిలో లేవని ట్రంప్ మండిపడ్డారు. అమెరికాను కాదని చైనాతో



వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. వంతెన ప్రాజెక్టుకు సంబంధించిన వెబ్‌సైట్ ప్రకారం.. డెట్రాయిట్ నదిపై ఏర్పాటుచేసిన గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను కెనడియన్ ప్రభుత్వానికి చెందిన విండ్సర్- డెట్రాయిట్ బ్రిడ్జ్ అథారిటీ అనే సంస్థ నిర్మించింది.దీనికి అక్కడి ప్రభుత్వమే నిధులు సమకూర్చింది. ఈ ఏడాదిలో దీనిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు చేయడం గమనార్హం. అయితే ట్రంప్ ప్రకటనపై కెనడా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బనానా షేక్ లేదా అరటి పండ్లు.. రెండింటిలో ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?





మన ఆరోగ్యానికి అరటిపండ్లు ఎంతో మేలు చేస్తాయన్న సంగతి మనకు తెలిసిందే. అరటిపండ్లల్లో ఫైబర్ తో పాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది. పేగు ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి సులభంగా జీర్ణమవుతాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అల్పాహారంగా, చిరుతిండిగా లేదా జిమ్ చేసిన తరువాత వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే కొంత మంది అరటిపండును నేరుగా తినడానికి ఇష్టపడరు. అరటిపండ్లతో బనానా షేక్ వంటి వాటిని తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. అయితే అరటిపండ్లను నేరుగా తినడం మంచిదా.. స్నాక్స్ రూపంలో తీసుకోవడం మంచిదా.. అన్న సందేహాలు కూడా మనలో చాలా మందికి వస్తూ ఉంటాయి.


**మిల్క్ షేక్ వద్దు..**

అరటిపండును ఏ విధంగా తీసుకోవడం మన ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థకు మంచిదో.. నిపుణులు దీని గురించి ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అరటిపండును ఏ రూపంలో తీసుకోవాలో వ్యక్తి శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అరటిపండును నేరుగా తీసుకోవడం మంచిది. జిమ్ కి వెళ్లే వారు, భారీ వ్యాయామాలు చేసే వారికి క్యాలరీలు ఎక్కువగా అవసరమవుతాయి. కనుక వ్యాయామాలు చేసేవారు అరటిపండును మిల్క్ షేక్ రూపంలో తీసుకోవడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆయుర్వేదం ప్రకారం అరటిపండును నమలి తినడం మంచిదని వారు చెబుతున్నారు. అరటిపండును నమలడం వల్ల లాలాజలంలో ఉండే సమ్మేళనాలు సక్రియం చేయబడతాయి. దీంతో జీర్ణక్రియ సులభతరం అవుతుంది.

**జీర్ణ క్రియకు ఆటంకం..**

అరటిపండును నమలడం వల్ల దానిలో ఉండే మొత్తం పోషకాలు శరీరానికి చక్కగా అందుతాయి. అరటిపండుతో స్మూతీ, షేక్ వంటివి చేసి తీసుకోవడం వల్ల దానిని నమలాల్సిన అవసరం లేదు. ఇది జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని కలిగిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం రెండు రెండు వేరువేరు పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల శరీర సహజ సమతుల్యం దెబ్బతింటుంది. అరటిపండును పాలతో కలిపి మిక్స్ చేసి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో కఫం పెరుగుతుంది. ఇది సైనస్, జలుబు, అలర్జీ వంటి వాటికి దారి తీస్తుంది. బనానా షేక్ పొట్టలోకి చేరిన తరువాత అరటిపండులో ఉండే మాలిక్, సిట్రిక్ ఆమ్లాలు పాలతో కలిసి పెరుగుగా మారుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. బనానా షేక్ జీర్ణం అవ్వడానికి సమయం పట్టడంతో పాటు పోషకాలను కూడా శరీరం సరిగ్గా గ్రహించదు. కనుక అరటిపండును నేరుగా తీసుకోవడమే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్యాలరీలు ఎక్కువగా కావాల్సిన వారు అరటిపండును తిన్న రెండు గంటల తరువాత పాలు తాగడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణ సమస్యలు రాకుండా ఉండడంతో పాటు శరీరానికి పోషకాలు కూడా చక్కగా అందుతాయి. పొట్ట సంబంధిత సమస్యలతో బాధపడే వారు బనానా షేక్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# మీ కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ఆహారాలను తీసుకోవాల్సిందే..!



మన శరీరం సక్రమంగా పనిచేయడానికి సహాయపడే అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు కూడా ఒకటి. ఇవి మన శరీరంలో అతి ముఖ్యమైన విధులను నిర్వర్తిస్తాయి. వ్యర్థాలను బయటకు పంపించడం, రక్తపోటును అదుపులో ఉంచడం, శరీరంలో ద్రవాలను సమతుల్యంగా ఉంచడం, శరీర జీవక్రియలకు మద్దతు ఇవ్వడం వంటి అనేక విధులను మూత్రపిండాలు నిర్వర్తిస్తాయి. అయితే ప్రస్తుత కాలంలో మనలో చాలా మంది మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. జంక్ ఫుడ్ ను, ప్రాసెస్ చేసిన ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతోంది. దీంతో మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటోంది. వాటి పనితీరు కూడా తగ్గుతోంది. మూత్రపిండాల ఆరోగ్యంపై మొత్తం శరీరం ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కనుక మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆహారాలను తీసుకోవడం వల్ల మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ముఖ్యమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**కీరదోస, నిమ్మకాయలు..**

మనకు చాలా తక్కువ ధరలో ఏడాది పొడవునా లభించే కూరగాయల్లో కీరదోసకాయ ఒకటి. వీటిలో నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతగానో సహాయపడతాయి. కీరదోసకాయలను తీసుకోవడం వల్ల శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. కీరదోసకాయలలో పొటాషియం తక్కువగా ఉంటుంది కనుక మూత్రపిండ సంబంధిత సమస్యలతో బాధపడే వారు కూడా వీటిని తీసుకోవచ్చు. నిమ్మకాయలు కూడా మూత్రపిండాల ఆరోగ్యానికి మద్దతును ఇస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లో రాళ్ల సమస్య నుండి కూడా బయటపడవచ్చు. నిమ్మకాయల్లో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా చేయడంలో దోహదపడుతుంది. రోజూ గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తీసుకోవడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యంతోపాటు వాటి పనితీరు కూడా మెరుగుపడుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మూత్రపిండాల కణాలు దెబ్బతినకుండా రక్షిస్తాయి.

**కొత్తిమీర..**

అలాగే కొత్తిమీరను తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మూత్రం ఉత్పత్తిని పెంచుతుంది. శరీరంలో ఉండే అదనపు ద్రవాలు, వ్యర్థాలు, విషాలు మూత్రం ద్వారా బయటకు పంపించడంలో కొత్తిమీర ఎంతో సహాయపడుతుంది. దీంతో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా ఉంటాయి. కొత్తిమీరలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వాపులను తగ్గించడంతో పాటు కణజాల నష్టం జరగకుండా కాపాడడంలో కూడా సహాయపడతాయి. దీనిలో నైట్రేట్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో ఉపయోగపడతాయి. అంతేకాకుండా ఈ ఆహారాలను తీసుకుంటూనే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, స్థాయిలను రక్తపోటును అదుపులో ఉంచుకోవడం, నీటిని తాగడం, ధూమపానాన్ని మానేయడం వంటివి చేయడం వల్ల మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు కూడా రాకుండా ఉంటాయని వైద్యులు సలహా ఇస్తున్నారు.

## నినాదం అవని 10

# లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే.. ఎప్పటికప్పుడు వీటిని తీసుకోవాల్సిందే..!




మన శరీరంలో కాలేయం అనేక విధులను నిర్వర్తిస్తుంది. శరీరం నుండి విషాన్ని బయటకు పంపించడం, శరీర జీవక్రియలను నిర్వహించడం, జీర్ణక్రియకు మద్దతు ఇవ్వడం, శరీరానికి అవసరమైన పోషకాలను నిల్వ చేయడం ఇలా అనేక రకాల విధులను ప్రతి రోజూ నిర్విరామంగా నిర్వర్తిస్తుంది. కాలేయ ఆరోగ్యం ఏ మాత్రం దెబ్బ తిన్నా మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. కనుక కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. సరైన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు కొన్ని సులభంగా తయారు చేసుకునే పానీయాలను తీసుకోవడం ద్వారా కాలేయాన్ని శుభ్రపరుచుకోవడంతో పాటు కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పానీయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**నీరు, గ్రీన్ టీ..**

కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే నీటిని ఎక్కువగా తాగాలి. నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉండడంతో పాటు శరీరం నుండి విషాలు ఎక్కువగా బయటకు తొలగిపోతాయి. అలాగే క్రీమ్, చక్కెర వంటివి లేకుండా బ్లాక్ కాఫీ తాగడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా చేయడంలో సహాయపడతాయి. దీంతో ఫ్యాటీ లివర్, సిర్రోసిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. క్రమం తప్పకుండా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో మనకు దోహదపడతాయి.


**బీట్ రూట్, నిమ్మకాయ..**

బీట్‌రూట్ రసం కూడా కాలేయ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కాలేయానికి ఒక సహజ టానిక్ లాగా పని చేస్తుంది. బీట్‌రూట్ రసంలో ఉండే బీటాలైన్లు, నైట్రేట్లు కాలేయం నిర్విషీకరణ ఎంజైమ్‌లను పెంచుతాయి. బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల కాలేయ వాపు తగ్గుతుంది. అలాగే ఆకుకూరలు, క్యారెట్లు, సెలెరీ వంటి వాటితో జ్యూస్ చేసి తీసుకోవడం వల్ల కాలేయంలో డీటాక్సిఫికేషన్ ప్రక్రియతో పాటు కాలేయం ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. రోజూ ఒక గ్లాస్ నిమ్మకాయ నీరు తాగడం వల్ల కాలేయం సహజంగా శుభ్రపడుతుంది. నిమ్మ కాయ నీరే అని చాలా మంది తేలికగా తీసు కుంటారు. కానీ కాలేయాన్ని శుభ్రపరచడంలో ఇది ప్రభావవంతంగా పని చేస్తుంది. అదే విధంగా ఉసిరికాయ జ్యూస్ కూడా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరు స్తుంది. దీనిలో విటమిన్ సితో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మనకు సహాయపడతాయి.

**కొబ్బరి నీళ్లు..**

కొబ్బరి నీరు కూడా కాలేయ ఆరోగ్యానికి మద్దుతు ఇస్తాయి. కొబ్బరి నీటిని తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉంటుంది. శరీరానికి కావల్సిన ఎలక్ట్రోలైట్స్, పోషకాలు అందుతాయి. అల్లం శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అల్లం కషాయాన్ని తీసుకోవడం వల్ల వాపు తగ్గి కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీరు కూడా కాలేయానికి మేలు చేస్తుంది. జీలకర్ర నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తద్వారా కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. కాలేయంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కూడా సమర్థవంతగా జరుగుతుంది. ఇలాంటి సహజసిద్ధమైన పానీయాలను తీసుకోవడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడడంతో పాటు కాలేయ ఆరోగ్యం ఉంటుంది.

## నినాదం మార్కెట్ NINADAM MARKET



# ఆధార్, పాన్ ఉంటే చాలు..

### కేవలం నిమిషాల్లోనే రూ.5లక్షల వరకు లోన్..



ఆధార్ కార్డు, పాన్ కార్డు కలిగి ఉన్నారా.. మీరు కేవలం నిమిషాల వ్యవధిలోనే రూ.5 లక్షల వరకు లోన్ పొందవచ్చు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎప్పుడు డబ్బులు అత్యవసరంగా ఉపయోగపడ తాయో తెలియదు. దీంతో చాలా బ్యాంక్‌లు ఇన్‌స్టంట్ లోన్లను ఆఫర్ చేస్తున్నాయి. ఒకప్పుడు లోన్ కావాలంటే బ్యాంకుల చుట్టూ రోజులు తరబడి తిరగాల్సి వచ్చేది. డాక్యుమెంట్స్ అన్నీ సమర్పించాక అధికారులు పరిశీలించి లోన్ మంజూరు చేయడానికి చాలా రోజుల సమయం పట్టేది. దాదాపు 10 రోజుల వరకు సమయం పట్టేంది. కానీ ఇప్పుడు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పింది. కేవలం మీ మొబైల్ ద్వారానే నిమిషాల్లోనే ఏ లోన్‌కైనా దరఖాస్తు చేసుకునే సుదుపాయం అందుబాటులోకి వచ్చింది. బ్యాంకింగ్ యాప్స్‌తో పాటు ఎన్‌ఎఫ్‌బీసీ సంస్థలు ఈ మేరకు మొబైల్ యాప్‌లను ప్రవేశపెట్టాయి. ఈ యాప్‌ల ద్వారా ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్లను మంజూరు చేస్తున్నాయి. కేవలం ఆధార్, పాన్ కార్డు వివరాలు ఇస్తే నిమిషాల వ్యవధిలోనే డబ్బులు మీ అకౌంట్లో జమ అవుతాయి. మీరు ఇక ఎలాంటి డాక్యుమెంట్స్ కూడా అందించాల్సిన అవసరం ఉండదు.

**పాన్ కార్డు, ఆధార్ ఇస్తే చాలు**

బ్యాంకులు, లోన్ యాప్స్, ఎన్‌ఎఫ్‌బీసీ సంస్థలు ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్లు మంజూరు చేస్తున్నాయి. వీటిని పొందాలంటే ఎలాంటి డాక్యుమెంట్ల అవసరం లేదు. కేవలం మీ పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు ఉంటే చాలు. వీటి వివరాలు నమోదు చేయడం ద్వారా మీరు నిమిషాల్లోనే పర్సనల్ లోన్ పొందవచ్చు. పర్సనల్ లోన్ అనేది అన్‌సెక్యూర్డ్ లోన్‌గా భావిస్తారు. ఇది పొందేందుకు ఎలాంటి డాక్యుమెంట్, ఆస్తి తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. పాన్ కార్డు ద్వారా మీ సిబిల్ స్కోర్‌ను చెక్ చేస్తారు. అలాగే ఆధార్ కార్డు ద్వారా మీ ఈకేవైసీ వివరాలు పూర్తి చేస్తారు. వెంటనే మీకు ఎంత లోన్ వస్తుందనేది నిర్ణయించి మంజూరు చేస్తారు.

**కావాల్సిన డాక్యుమెంట్స్**

-ఫిజికల్‌గా ఆధార్, పాన్ కార్డు ఇవ్వాల్సిన అవసరం లేదు -కేవలం డిజిటల్ రూపంలో ఆధార్, పాన్ అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది -క్రెడిట్ స్కోర్ 700 కంటే ఎక్కువ ఉంటే తక్కువ వడ్డీకే లోన్ అందుతుంది -సిబిల్ స్కోర్ 700 కంటే తక్కువగా ఉంటే వడ్డీ చాలా ఎక్కువగా ఉంటుంది -నెలవారీ ఆదాయం పొందేవారు, చిరు వ్యాపారులు ఈ లోన్లు తీసుకోవచ్చు

**వడ్డీ రేట్లు ఎంత ఉంటాయంటే..?**

ఈ పర్సనల్ లోన్ల వడ్డీ 10.5 శాతం నుంచి 24 శాతం వరకు ఉంటుంది. రూ.5 లక్షల వరు మీరు ఈ విధానం ద్వారా మీరు ఇన్‌స్టంట్ లోన్ పొందవచ్చు. ఇక కొన్ని బ్యాంకింగ్ సంస్థలు శాలరీ పే స్లిప్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్స్ అందించాల్సిందిగా కోరుతున్నాయి. వీటిని అందిస్తే మీ క్రెడిట్ లిమిట్‌ను నిర్ధారించి రుణం మంజూరు చేస్తాయి.

# ఇక యూపీఐ ద్వారా ఏటీఎం డబ్బులు విత్‌డ్రా!



ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ దాదాపు 80 మిలియన్ల మందికి బహుమతి ఇవ్వబోతోంది. ఇప్పుడు మీరు మీ పీఎఫ్ డబ్బును ఉపసంహరించుకోవడానికి కార్యాలయాన్ని సందర్శించాల్సిన అవసరం లేదు. ఈపీఎఫ్ఓ ఏప్రిల్ 2026లో కొత్త మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభిస్తోంది. దీని ద్వారా ఉద్యోగులు తమ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్)ను నేరుగా యూపీఐ ద్వారా బ్యాంకు ఖాతా నుండి ఏటీఎం ద్వారా ఉపసంహరించుకునే అవకాశం లభిస్తుంది. దీని అర్థం పీఎఫ్ ఉపసంహరణలతో ప్రస్తుతం ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయి. కార్మిక మంత్రిత్వ శాఖ వర్గాల సమాచారం ప్రకారం, కొత్త నియమం అమల్లోకి వచ్చినప్పుడు ఈపీఎఫ్‌వో ఫండ్‌లో కొంత భాగం రిజర్వ్‌లో ఉంచుతారు. అయితే ఎక్కువ భాగం తక్షణ ఉపసంహరణకు అందుబాటులో ఉంటుంది. సభ్యులు యూపీఐ ద్వారా దానిని ఉపసంహరించుకోవచ్చు. దీనివల్ల బ్యాంకింగ్ ప్రక్రియ వేగంగా, సురక్షితంగా ఉంటుంది.

**ఏప్రిల్ నుండి ఈ సౌకర్యాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు :**

ప్రస్తుతం ఈపీఎఫ్ సభ్యులు ఖాచీ పోర్టల్ లేదా యాప్ ద్వారా తమ ఖాతాల నుండి నిధులను ఉపసంహరించుకోవడానికి క్లెయిమ్‌లను దాఖలు చేస్తారని గమనించాలి. తదనంతరం క్లెయిమ్ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా రోజులు పడుతుంది. అయితే ఆటో-సెటిల్మెంట్ సిస్టమ్ కింద కొన్ని సందర్భాల్లో క్లెయిమ్‌లు మూడు రోజుల్లోపు పరిష్కారం అవుతాయి. అయినప్పటికీ దరఖాస్తు ఇప్పటికీ తప్పనిసరి. క్లెయిమ్‌ల సమయంలో చాలా మంది వ్యక్తులు ఇప్పటికీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కానీ కొత్త యాప్ ప్రారంభించిన తర్వాత ప్రజలు తమ పీఎఫ్ నిధులను క్షణాల్లో ఉపసంహరించుకోగలుగుతారు. అలాగే క్లెయిమ్ ప్రక్రియ సరళీకృతం అవుతుంది. ఇంకా కొత్త మొబైల్ యాప్ ఈపీఎఫ్‌వో సభ్యులు వారి ఈపీఎఫ్ బ్యాలెన్స్, పాస్‌బుక్ వివరాలు, ఉపసంహరణ వివరాలను నిజ సమయంలో చెక్ చేసుకునేందుకు అనుమతిస్తుంది. దీని తర్వాత వారు పీఎఫ్ నిధులను ఉపసంహరించుకోవాలనుకున్నప్పుడల్లా, వారు వారి లింక్ చేసిన పిన్‌ని ఉపయోగించి లావాదేవీని పూర్తి చేయవచ్చు.

**నకిలీ ఖాతాలపై విచారణ:**

ఈపీఎఫ్ఓ ప్రస్తుతం 100 డమ్మీ ఖాతాలలో ఈ వ్యవస్థను పరీక్షిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవస్థ ప్రారంభించే ముందు ఏవైనా సాంకేతిక లోపాలను సరిదిద్దడానికి ఇది ఉపయోగపడుతుంది. ట్రయల్ విజయవంతమైతే ఏప్రిల్‌లో దీనిని పెద్ద ఎత్తున ప్రారంభిస్తారు. ఈ యాప్ కోసం పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని కూడా కార్మిక మంత్రిత్వ శాఖ ప్లాన్ చేస్తోంది.

దాదాపు 80 మిలియన్ల మంది క్రియాశీల సభ్యులు ఉన్నారు ఏటా 50 మిలియన్లకు పైగా క్లెయిమ్‌లను ప్రాసెస్ చేస్తారు, వీటిలో ఎక్కువ భాగం ఈపీఎఫ్ ఉపసంహరణలకు సంబంధించినవి. ఇది ఈపీఎఫ్‌పై అధిక పనిభారాన్ని మోపుతుంది. కొత్త ఆధారిత వ్యవస్థ ఈ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఈపీఎఫ్‌వోకి బ్యాంకింగ్ లైసెన్స్ లేదని గమనించాలి. అందుకే దాని సభ్యులు తమ ఖాతాల నుండి నేరుగా నిధులను ఉపసంహరించుకోవడానికి అనుమతించలేరు. అందువల్ల ఈ మొత్తం ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ అవుతుంది. ఈపీఎఫ్‌వో సేవలను బ్యాంకింగ్ సేవలతో పోల్చదగినదిగా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# మార్చి 1 నుండి నిలిచిపోనున్న రైల్వేల యాప్..




ఇక అన్ని సేవలు అందులోనే..! రైల్వే మంత్రిత్వ శాఖ యూటీఎస్ టికెట్ బుకింగ్ యాప్‌లో సేవలను నిలిపివేయనుంది. డిసెంబర్ 27, 2014న ప్రారంభించిన యూటీఎస్ మొబైల్ అప్లికేషన్ ప్రయాణికులకు సీజన్ టిక్కెట్లు, ప్లాట్‌ఫామ్ టిక్కెట్లతో సహా రిజర్వ్ చేయని టిక్కెట్లను బుక్ చేసుకోవడానికి అనుమతిస్తుంది. రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇన్ఫర్మేషన్, పబ్లిసిటీ) దిలీప్ కుమార్ వివరాల ప్రకారం. గత సంవత్సరం ప్రారంభించిన కొత్త యాప్ రైల్‌వన్, యూజర్ ఫ్రెండ్లీ, ఇప్పటికే ఉన్న యూటీఎస్ యాప్ లక్షణాలను కూడా కలిగి ఉందన్నారు. ఇప్పుడు ప్రయాణికులు గత సంవత్సరం ప్రారంభించిన భారతీయ రైల్వే సూపర్ యాప్ -- రైల్‌వన్ సేవలను పొందవచ్చు. అలాగే ఇప్పటికే ఉన్న రైల్‌కనెక్ట్, యుటిఎస్ ఆధారాలకు మద్దతు ఇస్తుంది. రైల్వే ప్రయాణికులకు రైల్‌వన్ యాప్ వన్-స్టాప్ డిజిటల్ సొల్యూషన్‌గా కూడా పనిచేస్తుంది. రిజర్వ్ చేయని టిక్కెట్లు, రిజర్వ్డ్ టిక్కెట్లు, ప్లాట్‌ఫామ్ టిక్కెట్ల బుకింగ్‌తో పాటు రైల్ కనెక్ట్, చీజుూ, రైల్ మదద్, ఫుడ్ ఆన్ ట్రాక్ వంటి బహుళ ఇంటిగ్రేటెడ్ సేవలను ఒకే ఇంటర్‌ఫేస్ ద్వారా పొందేందుకు వీలు కల్పిస్తుంది.

**ఇండియన్ రైల్వేస్ రైల్ వన్ యాప్..**

జనవరి 2026 నుండి జాతీయ రవాణాదారుడు రైల్‌వన్ మొబైల్ అప్లికేషన్‌ను ఉపయోగించే ప్రయాణికులకు ప్రోత్సాహకాలను అందించడం ద్వారా డిజిటల్ టికెటింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. అన్ని రైలు ప్రయాణ అవసరాలను తీర్చడానికి రైల్‌వన్ యాప్ రూపొందించారు. రైల్‌వన్ యాప్‌లో అన్‌రిజర్వ్డ్ టిక్కెట్లను బుక్ చేసుకునే ప్రయాణికులకు అన్ని డిజిటల్ చెల్లింపు పద్ధతుల్లో 3 శాతం తగ్గింపు లభిస్తుంది. రైల్‌వన్ ప్లాట్‌ఫామ్‌లో యూపీఐ, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ మొదలైన డిజిటల్ చెల్లింపు ఎంపికలను ఉపయోగించి చేసే అన్‌రిజర్వ్డ్ టికెట్ బుకింగ్‌లకు ఈ తగ్గింపు వర్తిస్తుంది.

### బంగారం ధరలపై

# రానున్న రోజుల్లో ధరల పతనం..!



ప్రస్తుతం బంగారం ధరలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఇటీవల కొద్దిరోజుల పాటు తగ్గగా.. మళ్లీ పెరుగుదలను నమోదు చేస్తున్నాయి. ఈ క్రమంలో బంగారంపై పెట్టుబడి పెట్టేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తుండగా.. మరికొంతమంది ధరలు ఎప్పుడు పెరుగుతాయో లేదా ఎప్పుడు తగ్గుతాయో తెలియక వెనకడుగు వేస్తున్నారు. ప్రపంచంలోనే ప్రముఖ ఇన్వెస్టర్లుగా పేరు పొందిన రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకితో పాటు వారెన్ బఫెట్ బంగారం ధరలపై తమ అంచనాలను వెల్లడిస్తున్నారు. వారి అంచనాలను చాలామంది ఫాలో అవుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రముఖ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ బంగారం ధరలపై బాంబ్ పేల్చారు.

**బంగారం ధరలు పడిపోవచ్చు**

బంగారం ధరలు ఎప్పుడైనా పడిపోవచ్చని వారెన్ బఫెట్ స్పష్టం చేశారు. వెండితో పాటు ఇతర మెటల్స్ పారిశ్రామిక రంగంలో ఉపయోగిస్తారు. కానీ గోల్డ్‌ను ఆభరణాల తయారీకి మినహా వేటికి ఉపయోగించరు. దీంతో బంగారంకు డిమాండ్ తగ్గినప్పుడు ధరలు పడిపోయే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఉద్రిక్తతలు, యుద్ధ మేఘాలు, రాజకీయ అనిశ్చితి, ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పుడు ప్రజలు భయంతో బంగారం కొనుగోలు చేస్తారని, దీంతో గోల్డ్ రేటు పెరగడం లేదా తగ్గడం అనేది ప్రజల భయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. కంపెనీల షేర్లలో పెట్టుపడి పెడితే షేర్ ధర పెరగడమే కాకుండా డివిడెండ్లు, బోనస్ షేర్లు వస్తాయన్నారు. అదే బంగారంపై పెట్టుబడులు పెడితే అలాంటి బెనిఫిట్స్ ఏమీ ఉండవని వారెన్ బఫెట్ పేర్కొన్నారు.

**బంగారం చనిపోయిన ఆస్తి**

వారెన్ బఫెట్ బంగారాన్ని చనిపోయిన ఆస్తిగా అభివర్ణిస్తున్నారు. కేజీ బంగారాన్ని లాకర్‌లో భద్రపర్చుకుంటే అది ఎప్పటికి కేజీగానే ఉంటుంది. ఎన్నేళ్లయినా అది అలాగే ఉంటుంది కానీ అది ఎటువంటి ఉత్పత్తిని సృష్టించదు. అలాగే బంగారం ధర దానంతట అది పెరగదు. అదే వ్యాపారం లేదా భూమిలో పెట్టుబడి పెడితే లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో బంగారం అనేది చనిపోయిన ఆస్తి అని వారెన్ బఫెట్ స్పష్టం చేశారు. కాగా మంగళవారం బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. తులం బంగారంపై రూ.870 పెరిగింది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1.58 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1.45 లక్షల వద్ద ట్రేడవుతోంది. అటు కేజీ సిల్వర్ రూ.3 లక్షల వద్ద కొనసాగుతోంది.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**కాప్రా ఫిబ్రవరి 10 (నినాదం) :** నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్, శక్తి సాయి నగర్ డివిజన్ లో సుమారు 2 కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిలు. ఓల్డ్ మల్లాపూర్ లో భూగర్భ డ్రైనేజీ పనులు, ఓల్డ్ మల్లాపూర్ లో భూగర్భ డ్రైనేజి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం మొదటి అంతస్తు, ఎస్వీ నగర్ కాలనీ ఫేస్ 3 లో భూగర్భ డ్రైనేజీ, భవాని నగర్ కాలనీ రోడ్ నెంబర్ 3 లో భూగర్భ డ్రైనేజి, భవాని నగర్ కాలనీలో రోడ్ నెం 15 లో భూగర్భ డ్రైనేజీ, న్యూ భవాని నగర్ కాలనీ లో డ్రైనేజీ, మల్లికార్జున్ నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ, చాణక్యపురి కాలనీలో భూగర్భ డ్రైనేజి, చాణక్యపురి కాలనీలో భూగర్భ డ్రైనేజి, గోకుల్ నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్, యాదవ సంఘం నూతన భవనం, మున్నూరు కాపు స్మశాన వాటికలో పలు అభివృద్ధి పనులు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బోదాసు లక్ష్మీనారాయణ, చిన్న దుర్గయ్య, కోదండమ్ ధర్మారెడ్డి, చిగుళ్ల శ్రీనివాస్ (హమాలి సీనన్న), ఎస్.వి శివకుమార్, నాగరాజు, కుంటి కృష్ణ, ఉస్మాన్, శ్రీనివాస్ గౌడ్, వాసుదేవ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కటార్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి సందర్భంగా 'ఈశ్వర సర్వేశ్వర' భక్తిగీతం ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం):** రాబోయే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని, భక్తిగీతం 'ఈశ్వర సర్వేశ్వర' ను బిఆర్ఎస్ఎల్పీ. విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే శ్రీ కే.పీ. వివేకానంద మంగళవారం పెట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ భక్తిగీతం జగద్గిరిగుట్టలోని కేదార్నాథ్ ఆలయ శివ రుద్ర సాధువు మార్గదర్శకత్వంలో రూపొందించబడింది. ఈ గీతాన్ని సంతోష్ నిర్మించగా, మంకాల విష్ణు ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ, భక్తిగీతాలు యువతను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని తెలిపారు. శివభక్తులందరికీ ముందస్తుగా మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధువు శిష్యులు హనుమంతు, వెంకటేష్, రమేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ మార్పిడి చికిత్సకు తల్లి, కుమారుడికి సీఎంఆర్ఎఫ్ మంజూరు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 128 చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన రామలక్ష్మి, ఆమె తనయుడు రామ శ్రీహరి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, కిడ్నీ మార్పిడి చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే కె.పి. వివేకానంద ను సంప్రదించారు. బాధిత కుటుంబ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి, సి ఎం ఆర్ ఎఫ్ నిధుల నుంచి చికిత్స నిమిత్తం తల్లికి రూ.2 లక్షలు, కుమారుడికి రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.4 లక్షల సహాయాన్ని మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ ఓ సి చెక్కులను మంగళవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ రఫీక్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే తన ప్రధాన లక్ష్యమని, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శేఖర్ రావు, సాంబయ్య, బసవరాజు, సామ్రాట్‌తో పాటు బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వర్షాకాల సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
### రూ.2.23 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రెయిన్, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన





**అల్వాల్, ఫిబ్రవరి 11 (నినాదం):** అల్వాల్. వెంకటాపురండివిజన్ పరిధిలో ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న వరదలు, నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా కీలక అడుగు పడింది. వెంకటాపురం లాస్ట్ బస్ స్టాప్ సమీపంలో రూ.2 కోట్ల వ్యయంతో చేపడుతున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులకు, ఓల్డ్ వెంకటాపురం, మారుతి నగర్ కాలనీల్లో రూ.23 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మల్కాజ్‌గిరి శాసనసభ్యులు గౌరవ శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డిశంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, శ్రీమతి సబితా అనిల్ కిషోర్ గౌడ్ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలంలో తరచూ ఎదురయ్యే వరదలు, మురుగు నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ఈ బాక్స్ డ్రెయిన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. డ్రెయిన్ నిర్మాణం పూర్తయితే పరిసర కాలనీల్లో నీరునిలిచే సమస్య పూర్తిగా తొలగిపోతుందని, ప్రజలు నిశ్చింతగా నివసించగలుగుతారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ డి.ఈ. ప్రశాంతి, ఎ.ఈ. అరుణ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన



**కాప్రా, ఫిబ్రవరి 10 (నినాదం) :** కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్‌లో రూ.19 కోట్ల 36 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఐటీ ఌ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. రూ.3.75 కోట్లతో డీమార్ట్ రోడ్ మీదుగా పోచమ్మ ఆలయం వరకు, అక్కడి నుంచి కృష్ణారెడ్డి నగర్ ఆర్చ్ వరకు =జజ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం. రూ.2.85లక్షలతో సాయినగర్ ఆర్చ్ నుంచి ౧×ఖీ= కంపౌండ్ వాల్ ఌ కృష్ణారెడ్డి నగర్ రోడ్ నెం.1, 2 వరకు =జజ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం. రూ.3.13 కోట్లతో శ్రీ సాయి వెంకట్ ఎన్‌క్లేవ్, శివ సాయి నగర్, శ్రీనివాస ఎన్‌క్లేవ్, ఎచీ రెడ్డి నగర్, సుబోధయ కాలనీ, నాగార్జున నగర్, సోనియా గాంధీ నగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్, సాయి కృష్ణ నగర్, ఇందిరా నగర్, నెహ్రూ నగర్ లలో సీసీ రోడ్ల నిర్మాణం. రూ.1.26 కోట్లతో జీవీ= అపార్ట్‌మెంట్స్ నుంచి శివ సాయి గార్డెన్స్ వరకు 600 మిమీ వ్యాసం గల =జజ చీూ3 పైపు డ్రెయిన్ నిర్మాణం. రూ.5.50 కోట్లతో చిన్న చర్లపల్లి వార్డు నెం.03 లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సమాధి స్థలాల మోడల్ గ్రేవ్‌యార్డ్ అభివృద్ధి. రూ.2.87 కోట్లతో లోకమాత కాలనీ, విద్యా మారుతి కాలనీ, ×+ కాలనీ, శివ సాయి నగర్, అంబేద్కర్ నగర్, జ్యోతి నగర్, మధుసూదన్ రెడ్డి నగర్‌లలో సీసీ రోడ్ల నిర్మాణం. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి.. మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన



**కాప్రా, ఫిబ్రవరి 10 (నినాదం) :** నాచారం సర్కిల్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని బండబావి ప్రదేశంలో 9 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు. మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి లను కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ శాలువాతో సత్కరించి ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్వాగతం పలికారు. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు మంజూరు చేసే ప్రక్రియలో ముఖ్యపాత్ర పోషించిన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం నా పదవీకాలంలో నా విజయంగా భావిస్తూ చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మంత్రి బండబావి నమూనా డిజైన్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రాజెక్టు డిజైన్ వివరాలు మంత్రి కి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్చార్జి ఎం.పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చింతల కనకా రెడ్డి జయంతి వేడుకలు



**అల్వాల్, ఫిబ్రవరి 11 నినాదం):** స్వర్గీయ మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే చింతల కనుక రెడ్డి జయంతి సందర్భంగా కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకొని ఆయన బాటలో ప్రయాణించాలని కార్యకర్తలకు కోరారు ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, శోభన్ బాబు, రాపర్తి చంద్రశేఖర్, అరవింద్ ,ప్రేమ్ కుమార్, సల్వరాజు సాజిద్, జామా మహేందర్, మహేష్, అంజయ్య, సెంథిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవాల్లో పాల్గొన్న కొలను హనుమంత రెడ్డి





**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్ లో వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయ వార్షికోత్సవ జాతర మహోత్సవాలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆరోగ్యం, సమృద్ధి పొందాలని కోరారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, శాంతిని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు, సిద్దనోళ్ల సంజీవరెడ్డి,బట్టపాల కృష్ణ, మైసిగారి శ్రీనివాస్, హమ్మి రెడ్డి, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల సమస్య పరిష్కరిస్తా..

### కొలను హనుమంత రెడ్డి హామీ



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్ డివిజన్ నుండి కూకట్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలోని చెరువు గట్టు ప్రాంతంలో జీవనోపాధి కోసం చిన్న వ్యాపారులను ఇటీవల హైడ్రా అధికారులు ఖాళీ చేయించి ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించారు. ఆ స్థలంపై కొంతమంది వివాదం సృష్టించడంతో వ్యాపారులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి సంబంధిత రెవిన్యూ, మునిసిపల్ అధికారులతో మాట్లాడి, అవసరమైతే జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ తో కూడా చర్చిస్తామని తెలిపారు. పేద కుటుంబాలకు ఇదే ఏకైక ఉపాధి మార్గమని, అదే సమయంలో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు కూడా అవసరమేనని పేర్కొంటూ, రెండు అంశాలను సమతుల్యంగా పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాన్ని వెల్లడించారు. చిరు వ్యాపారుల కోసం ప్రత్యామ్నాయంగా చూపించిన స్థలం పూర్తిగా ప్రభుత్వ స్థలమని, అక్కడి లిటిగేషన్లు తొలగించి రెండు మూడు రోజుల్లో పేద వ్యాపారులకు శాశ్వతంగా దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలేటి శ్రీనివాస్, వ్యాపారులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ దేవి వార్షికోత్సవంలో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్ లో గల శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి 22వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాజరై శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ కు ఆలయ మర్యాదలతో ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా అమ్మవారి వార్షికోత్సవాలు నిర్వహించడం చాలా సంతోషమని అదేవిధంగా ఆ ఎల్లమ్మ దేవి ఆశిస్సులు కృపాకటాక్షాలు, ఆయురారోగ్యాలతో ప్రజలందరూ సుఖ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# అల్వాల్‌లో హైడ్రా పంజా..

### చెరువుల ఆక్రమణల కూల్చివేతలు
### పత్రికలలో వచ్చిన వరుస కథనాలకు స్పందన..
### హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



**అల్వాల్, ఫిబ్రవరి 11( నినాదం):** అల్వాల్ సర్కిల్ లో హైడ్రా పంజా విసిరింది. ఇక్కడి కొత్త చెరువుకు సంబంధించి ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లలో పెద్ద ఎత్తున వెలసిన ఆక్రమణలను కూల్చివేత పనులను హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టారు. మంగళవారం హైడ్రా ఇన్స్పెక్టర్ మల్లేశ్వర్ నేతృత్వంలో కూల్చివేత పనులను నిర్వహించారు. కాగా అల్వాల్ సర్కిల్ పరిధిలోని చెరువులకు సంబంధించి పత్రికలలో వరుస కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. చెరువుల ఎఫ్టీఎల్ , బఫర్ జోన్ లలో వెలసిన ఆక్రమణలను పత్రికలలో కథనాల్లో వెలుగులోకి తీసుకురావడం జరిగింది. ఫలితంగా నేడు హైడ్రా ఆక్రమణల కూల్చివేత పనులను చేపట్టడం పట్ల స్థానికంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి





### విద్యుత్ శాఖ సీనియర్ ఇంజనీర్ వెంకన్న
### విద్యుత్ శాఖ 'ప్రజా బాట' కార్యక్రమం..

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 10 (నినాదం):** ప్రజలకు ఏ విధమైనటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన నిరంతరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఎస్ ఈ పి వెంకన్న అన్నారు. మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్ శాఖ ప్రతిష్టాత్మకగా చేపట్టిన 'ప్రజా బాట' కార్యక్రమంను వినాయక్ నగర్ డివిజన్‌లోని శివ నగర్ లో విద్యుత్ అధికారులు నిర్వహించారు. ప్రతి వారం మంగళ, గురు, శనివారాల్లో జరిగే కార్యక్రమంలో భాగంగా మంగళవారం వినాయక నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డిల ఆహ్వానం మేరకు విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. విద్యుత్ శాఖ అధికారులతో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను స్వయంగా ఎస్ ఈ పి వెంకన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న విద్యుత్ అంతరాయాలు, వేలాడుతున్న వైర్లు, ఇతర సాంకేతిక సమస్యలను నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను గమనించిన సీనియర్ ఇంజనీర్, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈ అన్వర్ పాషా, ఏడిఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ జి లత, ఎఫ్ ఎం ఎండి గౌస్, ఎల్ ఐ వెంకట్ స్వామి, ఎల్ ఎం ఉపేందర్ రెడ్డి, సిబ్బంది రంగారెడ్డి, శ్రీశైలం, శివ నగర్ కాలనీ అధ్యక్షులు పి అంజయ్య, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## 'హై లైన్ కంఫార్ట్స్ ఐ కంపాట్స్' ఫర్నిచర్ షోరూమ్‌లో డైరీ ఆవిష్కరణ



**అల్వాల్, ఫిబ్రవరి 11( నినాదం):** మల్కాజ్‌గిరి శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి మచ్చ బొల్లారం ఐస్ ఫ్యాక్టరీ రోడ్‌లో నూతనంగా ప్రారంభమైన హై లైన్ క్యాంప్యాడ్స్ ఫర్నిచర్ షోరూమ్‌లో డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్ సోఫా సెట్స్, ప్రీమియం కాట్స్, మ్యాట్రసులు, డైనింగ్ టేబుల్స్, మాడ్యులర్ కిచెన్, కర్టెన్స్‌తో పాటు ఇంటీరియర్‌కు అవసరమైన ఆధునిక గృహోపకరణాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఉత్పత్తుల నాణ్యత, డిజైన్లు వినియోగదారులకు అనుకూలంగా ఉన్నాయని ప్రశంసించారు. షోరూమ్ నిర్వాహకులు రెహ్మత్ ఖాన్ ను యువత వ్యాపార రంగంలో మరింత రాణించాలని, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అభినందించారు. ఇలాంటి వ్యాపారాలు ప్రాంతఅభివృద్ధికిదోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మోసిన్ సయ్యద్ ఆరిఫ్ , ఫాసిల్ ఖాన్ , సమీర్, అఫ్సర్,అజ్జు భాయ్ పాటు ఇతర ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

## కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 10 (నినాదం):** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ శక్తుల బడా వ్యాపారవేత్తల అనుకూల విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక శ్రమజీవుల హక్కుల పరిరక్షణకై ఫిబ్రవరి 12వ తేదీన జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరపాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మెలో వేలాది మంది కార్మికులు సమ్మె లో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాలతో త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక వర్గాల ప్రయోజనాలను కాల రాస్తున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆ కోడ్స్ రద్దు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రైతు కూలీలకు ఉపాధి కల్పించి వలసలను నిరోధించేందుకు యూపీఏ ప్రభుత్వం తెచ్చిన మహాత్మా గాంధీజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి బి బి జి రామ్ జి చట్టాన్ని చేయడం దుర్మార్గమని దానిని వెంటనే రద్దుచేసి, పాత చట్టాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు.

## మోడి, బండి సంజయ్‌లతోనే

# కరీంనగర్ అభివృద్ధి సాధ్యం

**కరీంనగర్ భవిష్యత్తు, అభివృద్ధి కోసం బిజెపి అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించండి**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి , సెంట్రల్ ఫిలీం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర**



**కరీంనగర్, ఫిబ్రవరి 10(నినాదం):** భారతీయ జనతా పార్టీ జనం గుండెల్లో ఉందని, వరుసగా రెండుసార్లు జరిగిన కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ కి బ్రహ్మరథం పట్టి, బండి సంజయ్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించారని, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బిజెపి అభ్యర్థులు మల్కా కొమరయ్య, అంజి రెడ్డిలను ఆశీర్వదించి గెలిపించారని, బిజెపి జనం గుండెల్లో ఉందనడానికి పార్లమెంటు, ఎమ్మెల్సీ ఫలితాలే నిదర్శనమని., నేడు జరగబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా పట్టణ ప్రజలంతా బిజెపి వైపు ఉన్నారని, కార్పొరేషన్ ఫలితాల అనంతరం కరీంనగర్లో బిజెపి తిరుగులేని శక్తిగా అవతరించనుందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. మంగళవారం రోజున కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ 11న జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి విజయ కేతనం ఎగురవేస్తుందని, కరీంనగర్ మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుని, బల్దియా పై కాషాయ జెండా ఎగరవేసి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెండేళ్లయిన నగరపాలక సంస్థ అభివృద్ధి గురించి పట్టించుకోని , కార్పొరేషన్ కు ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుపై పట్టణ ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది గుండు సున్న... నేడు ఈ ఎన్నికల్లో 40 సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, గడిచిన రెండేళ్లలో ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదనే భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు. అందుకే మున్సిపల్ కార్పొరేషన్ లో గట్టెక్కడానికి చీకటి స్నేహితులు ఎంఐఎం తో లోపాయి కారి ఒప్పందం చేసుకొని , మైనార్టీ ఓట్లతో గట్టెక్కడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఎంఐఎం, కాంగ్రెస్ కలిసి కరీంనగర్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే ఆశతో అనేక రాజకీయ డ్రామాలు చేస్తుందన్నారు. అలాగే బి ఆర్ ఎస్ పార్టీకి ఎన్నికల్లో ఓటు వేయడం దండగని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కరీంనగర్ అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. నేడు అధికారంలో లేని బి ఆర్ ఎస్ కు ఓటు వేసి ప్రజలు నష్టపోవద్దని, డివిజన్ అభివృద్ధిని ప్రమాదంలోకి నెట్టవద్దన్నారు. గతంలో కాంగ్రెస్ , బి ఆర్ ఎస్ లకు నగరపాలక సంస్థ అధికారాల ను అప్పగించిన కరీంనగర్కు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అందుకే నేడు జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ , ఎంఐఎం, బిఆర్ఎస్ లకు తగిన బుద్ధి , గుణపాఠం చెప్పాలన్నారు. కరీంనగర్ అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కరీంనగర్ పట్టణానికి స్మార్ట్ సిటీ హోదా ఇచ్చి , వేలకోట్ల నిధులను అందించిందన్నారు. స్మార్ట్ సిటీ నిధులతోనే కరీంనగర్ పట్టణ రూపురేఖలు మారాయన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కట్టుబడి ఉన్నారన్నారు. కరీంనగర్ భవిష్యత్తు , అభివృద్ధి కోసం బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు.

# మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ కార్పొరేషన్, చొప్పదండి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన**



**కరీంనగర్, ఫిబ్రవరి 10(నినాదం)** జిల్లాలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీలకు బుధవారం నిర్వహించనున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. 2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా కరీంనగర్ జిల్లాలో పోలింగ్ జరగనున్న కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా చొప్పదండి మున్సిపాలిటీకి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే రూట్, మానిటరింగ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామాగ్రితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, అధికారులు సూచించిన చోటే బస చేయాలని ఆదేశించారు. చొప్పదండిలో పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

**కరీంనగర్ కార్పొరేషన్ సహా హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండిలో నిఘా**

**స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత**

**పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం**




**కరీంనగర్, ఫిబ్రవరి 10(నినాదం):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికల నిర్వహణకు పోలీస్ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం మొత్తం 1300 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 900 మంది సిబ్బంది ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తారన్నారు. కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 109 పోలింగ్ లొకేషన్లలో 28 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వాటిలో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. అంతేకాకుండా 66 వార్డులను 33 రూట్లుగా విభజించి, ప్రతి రూట్‌కు ఒక ఎస్సై, ప్రతి రెండు రూట్లకు ఒక ఇన్స్పెక్టర్ (క్లస్టర్ ఇన్చార్జ్) పర్యవేక్షిస్తారు. ప్రతీ నాలుగు క్లస్టర్లకు ఒక ఏసీపీ స్థాయి అధికారిని నియమించమన్నారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ స్థాయి అధికారులతో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దించామన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే 189 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేయగా, 49 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించినట్లు సీపీ తెలిపారు. ఇప్పటివరకు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి 13 కేసులు నమోదయ్యాయి. నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు 23 ప్రత్యేక బృందాలు నిరంతరం పెట్రోలింగ్ తోపాటు వాహన తనిఖీలు చేస్తున్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ ఉదయం 6 గంటల నుండి 12వ తేదీ ఉదయం 6 గంటల వరకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 (పాత సెక్షన్ 144) అమలులో ఉంటుంది. ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుమికూడటం నిషేధమని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. జిల్లాలోని 625 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతతోపాటు, సున్నితమైన, కేంద్రాలను గుర్తించి, అక్కడ సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా ఉంచాం. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎవరినీ అనుమతించబోము. 11వ తేదీన పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తాము. 13వ తేదీ కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఓటర్లు ఎవరికీ భయపడకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ఉల్లంఘనలు లేదా అవాంఛనీయ సంఘటనలపై ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్లు 87126 70744, 87126 70745 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సీపీ కోరారు.

## ఒక్కసారి అవకాశం ఇవ్వండి..

# అభివృద్ధి చేసి చూపిస్తాం

**-బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు**



**మెట్‌పల్లి, ఫిబ్రవరి 10 (నినాదం):** ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులను ఒక్కసారి అవకాశం ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు అన్నారు. మంగళవారం మెట్‌పల్లిలో పాత్రికేయులకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు అధిక భాగం నిధులు కేంద్ర ప్రభుత్వమే మంజూరు చేస్తోందని తెలిపారు. పెన్షన్లలో కూడా కేంద్ర ప్రభుత్వ వాటా ఎక్కువగా ఉంటుందని గుర్తు చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు, నవోదయ పాఠశాలల మంజూరు, జాతీయ రహదారుల అభివృద్ధి, మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు వంటి అనేక సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో మెట్‌పల్లి, కోరుట్లలోని అన్ని వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలి


**కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్**



**సిద్దిపేట ఫిబ్రవరి 10 (నినాదం ):** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా వేతనాలు అందించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏకలవ్య భవనంలో మెడికల్ అండ్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా కాకుండా ఏజెన్సీల ద్వారా వేతనాలు అందించడంతో తీవ్రంగా నష్టపోతున్నారు అన్నారు. అంతేకాకుండా ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సానిటేషన్, పేషంట్ కేర్ విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రూ. 20వేల రూపాయలకు తగ్గకుండా వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు స్లాబ్ సిస్టమ్ తొలగించి క్యాడర్ బేసిక్ వేతనం ఇవ్వాలన్నారు. సంవత్సరాలనుండి పనిచేసున్న ఉద్యోగులకు ప్రస్తుతం నియామకమైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి ఒకే రకమైన వేతనం కాకుండా సంవత్సరానికి 10 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఐక్యంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీయొద్దీన్, అసోసియేట్ అధ్యక్షులు ఐతీ శాంతి కుమార్, స్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు చేస్తే బెదిరిస్తారా

**-ఆర్టిఐ కార్యకర్త షాదుల్**



**సిద్దిపేట ఫిబ్రవరి 10 (నినాదం).** నా పైనే ఆర్టీఐ వేస్తావా ఫిర్యాదు చేస్తావా నువ్వు ఎవరివి నువ్వు అధికారివా నీకేం అవసరం నా దగ్గరికి వచ్చే ముఖం ఉందా నువ్వు ఎవరివిరా ఐదు లక్షలు అడగలేదా అంటూ అధికారి ఒక ఆర్టిఐ కార్యకర్త షాదుల్ కు ఫోన్ చేసి రికార్డు చేసుకో అంటూ బెదిరిస్తున్న వైనం ప్రస్తుతం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ప్రస్తుతం దుబ్బాక మండలం రాజక్క పేట గ్రామంలో జిపిఓగా విధులు నిర్వహిస్తున్న మధ్యల రవి అతని ఉద్యోగానికి సంబంధించిన అర్హత పత్రాలు న్యాయపరంగా లేవని జూనియర్ అసిస్టెంట్ పదవికి అతను అర్హుడు కాదని పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాత కౌన్సిల్ ఫర్ ఆర్.టి.ఐ స్టేట్ ప్రెసిడెంట్ షాదుల్ సిద్దిపేట జిల్లా కలెక్టర్ కి నేరుగా గత సంవత్సరం నవంబర్ 24న ఇట్టి అధికారిపై విచారణ జరిపించగలరని ఫిర్యాదు చేశారని తెలిపారు. తరువాత అట్టి ఫిర్యాదు పై ఏమైనా చర్యలు తీసుకున్నారా తీసుకుంటే వారి వివరాలు ఏమిటి అని ఈనెల 4 తేదీన సమాచార దరఖాస్తు చేశారని తెలిపారు. తదనంతరం ఈనెల 6న నాకు చరవాణి ద్వారా ఫోన్ చేసి నోరు అదుపు లేకుండా తిడుతూ నువ్వు ఎవరివి రా, అధికారివ, నాపైన ఆర్టిఐ వేస్తావా అంటూ నా ఎదురుగా వచ్చి మాట్లాడు అంటూ నాపై దుర్భాశ లాడుతూ భయభ్రాంతులకు గురి చేసే విధంగా బెదిరించారని అంతే కాకుండా ఐదు లక్షలు అడగలేదా అంటూ నాపై అభినందలు వేస్తూ భయభ్రాంతులకు గురిచేశాడని అట్టి అధికారి నుంచి నాకు ప్రాణహాని ఉందని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని అతని నుంచి నన్ను కాపాడి అతని ఉద్యోగం పై పూర్తి విచారణ జరపాలని కఠిన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ ఆర్.టి.ఐ రాష్ట్ర అధ్యక్షులు షాదుల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు శ్రీరామం జయలక్ష్మి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శనలు



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 10:(నినాదం):** ఖమ్మం గుట్టల బజార్ లోని కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణ రామ మందిరంలో ఈ నెల 11న బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీరామం జయలక్ష్మి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరాముల జగదీశ్వర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రముఖ స్త్రీ స్వర గాయకులు డాక్టర్ దీక్షిత్ సుబ్రహ్మణ్యంచే అన్నమయ్య కీర్తనలు, శ్రీరాముల జగదీశ్వర రావుచే భక్త రామదాసు కీర్తనలు, చిరంజీవి శ్రీరాముల ధీయాన్షి నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.రాజ గోపాల్, కన్యకా పరమేశ్వరి దేవాల యం కమిటీ ఛైర్మన్ మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, ఆరాధ్య ఎమర్జెన్సీ హాస్పిటల్ ఎమ్ డి డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త దేవత రాజారావు హాజరు కానున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వాటర్ లికేజ్ సమస్యను పరిష్కరించిన వార్డ్ సభ్యులు



**మల్హర్ ఫిబ్రవరి 10 (నినాదం):** మండలంలో కొయ్యూరు గ్రామపంచాయతీ నాలుగో వార్డులో వాటర్ లికేజ్ సమస్యను పరిష్కరించిన వార్డు సభ్యులు, దంపతులు లకావత్ లక్ష్మి-తిరుపతి, మిషన్ భగీరథ వాటార్ లికేజ్ కావడం తో మురికి వాటార్ రావడం వాళ్ళ ప్రజలు ఇబ్బందులు పడు తున్న విషయం తెలుసుకొని వార్డు సభ్యులు లక్ష్మి తిరుపతి, దంపతులు స్వయంగా పరిశుద్ధ కార్మికుల సహాయం తో ఉప సర్పంచ్ లకవత్ సవేందర్, ఆధ్వర్యంలో లికేజ్ సమస్యను శాశ్వతంగా తొలగించారు సమస్య పరిష్కారం చేసినందుకు నాలుగో వార్డు ప్రజలు వార్డు సభ్యులను అభినందించారు.

## 11న పాఠశాలలకు సెలవు

**- జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి**

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 10( నినాదం):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఆదేశాల మేరకు ఈనెల 11న పోలింగ్ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డిఈఓ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నందున ప్రభుత్వం సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. 11న సెలవు ప్రకటించడంతో ఈనెల 14న రెండవ శనివారం యధావిధిగా పాఠశాలలు నిర్వహించనున్నట్లు డీఈవో పేర్కొన్నారు.


## 108 అంబులెన్స్‌పై ఆకస్మిక తనిఖీ

**-జిల్లా మేనేజర్ గుర్రపు భరత్ కుమార్ ఆదేశాలు**



**నల్లబెల్లి, ఫిబ్రవరి 10 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ప్రాంగణంలో ఉన్న 108 అంబులెన్స్ వాహనంపై సంబంధిత జిల్లా మేనేజర్ గుర్రపు భరత్ కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబులెన్స్ నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లు, అత్యవసర వైద్య పరికరాలు, మందులను క్షుణ్ణంగా పరిశీలించారు. కాల్ సెంటర్ నుంచి వచ్చే ప్రతి అత్యవసర సమాచారం ఆలస్యం కాకుండా వెంటనే రిజిస్టర్లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనారోగ్యంతో లేదా ప్రమాదాలకు గురైన బాధితుల వద్దకు సకాలంలో చేరుకుని ప్రథమ చికిత్స అందించాలని, అనంతరం పరిస్థితిని బట్టి సమీపంలోని అందుబాటులో ఉన్న ఏరియా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం లేకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుతున్న అత్యవసర సేవల్లో నాణ్యత ఉండేలా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న 102 అంబులెన్స్ సేవలను గర్భిణీ స్త్రీలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత అంబులెన్స్ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా సిబ్బంది బాధ్యతగా పని చేయాలని, అత్యవసర సమయాల్లో ఒక్క నిమిషం ఆలస్యం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశముందని హెచ్చరించారు. అనంతరం సిబ్బందికి శాఖాపరమైన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎంటి ప్రవళిక, అంబులెన్స్ పైలెట్ కిరణ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించిన సర్పంచ్ భూక్య భాస్కర్



**నల్లబెల్లి, ఫిబ్రవరి 10 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన భూక్య సీతారాంకమలమ్మ దంపతుల కుమారుడు భూక్య జగన్‌కళ్యాణి దంపతుల కుమారుని మొదటి పుట్టినరోజు వేడుకలు మంగళవారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నందిగామ గ్రామ సర్పంచ్ భూక్య భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించి, తల్లిదండ్రులకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య భాస్కర్ మాట్లాడుతూ, చిన్నారి ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును

# వినియోగించుకోండి

**అత్యధిక ఓటింగ్ తో కరీంనగర్ ను అగ్రభాగాన నిలపండి**


**దేశం, ధర్మం కోసం, నిజాయితీగా పనిచేసే వారికి ఓటేయండి**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్, ఫిబ్రవరి 10(నినాదం)** మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక శాతం పోలింగ్ జరిగిన పార్లమెంట్ గా కరీంనగర్ అగ్రస్థానంలో నిలపాలని కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశం కోసం, ధర్మం కోసం, ప్రజల అభ్యున్నతి కోసం నిజాయితీగా పనిచేసే అభ్యర్థులకే ఓటేసి ప్రజాస్వామ్య విలువలకు పట్టం కట్టాలని అభ్యర్థించారు. మీరు వేసే ఓటు మన కార్పొరేషన్, మన మున్సిపాలిటీల అభివృద్ధికి దోహదం చేయాలని ఆకాంక్షించారు. మీరు వేసే ఓటు అవినీతిపరుల, అరాచక వాదుల, భూకబ్జా దారుల పాలిట అంకుశంగా మారాలని అభిప్రాయపడ్డారు.

## కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన సర్పంచ్ మాచర్ల కుమారస్వామి



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 10 (నినాదం) :** హనుమకొండ జిల్లా భీమదేవ రపల్లి మండల కేంద్ర గ్రామ పంచాయతీలో మంగళవారం రోజున కళ్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించగా, అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బొక్కల తిరుపతమ్మ, ఎలుకపెల్లి రాజేశ్వరి, గుండేటి లక్ష్మీలకు కళ్యాణ లక్ష్మి చెక్కులను సర్పంచ్ మాచర్ల కుమారస్వామి అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, ఉప సర్పంచ్ ఐలయ్య, జీపీఓ సారంగపాణి, సెక్రటరీ రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, లలిత, పోలు అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కుష్టు రహిత సమాజమే లక్ష్యం

**స్పర్శ్ అవగాహన పక్షోత్సవం**

**జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ పర్యటన**

**రోగ నివారణ, ఆరోగ్య సంరక్షణపై విస్తృత ప్రచారం**

**ఎదురుగడ్డ కుష్టు కాలనీ, పాఠశాలల్లో పర్యటన**

**విద్యార్థులు, కుష్టు రోగులకు అవగాహన**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 10(నినాదం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డలో నిర్వహిస్తున్న స్పర్శ్ కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ హేమచంద్రాపురం కుష్టు కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, అనంతరం కుష్టు వ్యాధి వల్ల కలిగే శారీరక లోపాలను ముందుగానే నివారించే విధానాలు, రోగులకు అవసరమైన నిరంతర ఆరోగ్య సంరక్షణ, వ్యాధి వ్యాప్తి కారణాలు, ప్రభుత్వం అందిస్తున్న చికిత్సా సేవలపై విస్తృతంగా వివరించారు. కుష్టు రోగులకు స్వీయ సంరక్షణ సామగ్రి, ప్రత్యేక చెప్పులు, పోషకాహార రంగాపండ్లను పంపిణీ చేసి, ధైర్యం నింపే మాటలతో వారి మనోబలాన్ని పెంచారు. కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని, అపోహలకు తావివ్వకుండా చికిత్స పొందాలని సూచించారు. అనంతరం యేదురుగడ్డ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా వైద్యాధికారి, విద్యార్థులకు సమతుల ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తాగునీరు ఆహార భద్రతపై అవగాహన కల్పించారు. చేతులు సరిగ్గా కడుక్కోవడం ద్వారా అనేక రోగాలను నివారించవచ్చని వివరించారు. రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, అది ఆరోగ్యానికి హానికరమని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ కృమి నివారణ దినోత్సవంపై అవగాహన కల్పిస్తూ, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు కృమినాశక మాత్రల వినియోగం ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు ఈ మాత్రలను అందిస్తోందని, ప్రతి బాలబాలిక తప్పనిసరిగా వాటిని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుష్టు వ్యాధి నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ బి. పుల్లారెడ్డి, ఆరోగ్య పథకాల అధికారి డాక్టర్ తేజశ్రీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ స్వప్న, జిల్లా పథక నిర్వహణ అధికారి మోహన్, కుష్టు పునరావాస సిబ్బంది భద్రు, ఆరోగ్య సిబ్బంది, కుష్టు రోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

## ఎస్పీ శరత్ చంద్ర పవార్





**నల్లగొండ (ప్రతినిధి, ఫిబ్రవరి 10(నినాదం):** నల్లగొండ జిల్లాలో జరుగనున్న మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిష్పక్షపాతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఒక కార్పొరేషన్ తో పాటు 06 మున్సిపాలిటీలలో 164 వార్డులలో 47 3 పోలింగ్ స్టేషన్లలో జరుగనున్న ఎన్నికల్లో 66 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి, ఆయా పోలింగ్ స్టేషన్ పరిధిలో అదనపు బలగాలు, 07 స్ట్రైకింగ్ ఫోర్స్,14 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 47 రూట్ మొబైల్ పార్టీలు, 08 ఎస్ఎస్టి టీంలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఒక అడిషనల్ ఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 29 మంది సీఐలు, 84 మంది ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 1097 మంది మరియు 5 ప్లాటున్ల టిజి ఎస్పీ పోలీస్ సిబ్బందిని నియమించి పటిష్ట భద్రతా ఏర్పా ట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ఎక్కడైనా చిన్నపాటి సమస్య తలెత్తినా అక్కడికక్కడే పరిష్కరించే వి ధంగా ముందస్తు చర్యలు తీసుకున్నామని అన్నారు.ఎన్నికల సమయంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్న పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలను కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు . గత ఎన్నికల్లో గొడవలు, కేసుల్లో ఉన్న నేర చరిత్ర కలిగిన వ్యక్తులు మరియు రౌడీ షీటర్లను గుర్తించి జిల్లా వ్యాప్తంగా 3 33 మందిని బైండోవర్ చే యడంతో పాటు వారి కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా గొడవలకు గానీ, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు గానీ పాల్పడితే కఠి నమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున, గుంపులుగా ఉండరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల నుండి 100 మీట ర్ల పరిధిలో ఎవరూ ఉండకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**చింతపల్లి, ఫిబ్రవరి 10(నినాదం):** మండల పరిధిలోని కుర్మేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల పరీక్షల కోసం రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంత్ రెడ్డితో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పాండురంగారావు మాట్లాడుతూ ఒక లక్ష్యంతో విద్యార్థులు చదువును ఇష్టపడి చదవాలన్నారు. పదవ తరగతి నుంచే ఒక లక్ష్యంతో ముందుకు సాగితే భవిష్యత్తు ఆనందమయంగా ఉంటుందని, బాబాసాహెబ్ అంబేద్కర్, సావిత్రిబాయి పూలే ,అబ్దుల్ కలాం, భగత్ సింగ్, తదితర మేధావుల స్ఫూర్తి నింపుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సాధించే మంచి ఫలితాలు ఫౌండేషన్ మరిన్ని మంచి పనులు నిర్వహించడానికి దోహదపడతాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విజేతలను అభినందించిన ఎంపీడీఓ



**కమలాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం) :** సిఎం కప్ హనుమకొండ జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడలలో కమలాపూర్ మండలానికి చెందిన పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచారని మంగళవారం స్థానిక ఎంపీడీఓ జి బాబు తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం కో కో రెండవ స్థానం చరణ్,హర్షవర్ధన్,రామ్ చరణ్,సాయి చరణ్, గణేష్ ,జోసెఫ్,అథ్లెటిక్స్అండర్18 లాంగ్ జంప్ లో మొదటి స్థానం మన్విత్ కుమార్ ,జావాలిన్ త్రో రెండవ స్థానం రాజేష్,400 మీటర్ల పరుగు పందెం లో మొదటి స్థానము మనవిత్ ,అండర్16 జావాలిన్ త్రో కె చరణ్ మొదటి బహుమతి,మర్రిపల్లిగూడెం క్రీడాకారులు కబడ్డీలో రెండవ స్థానం,ఎన్ దుర్గ లక్ష్మి 400మీటర్ల పరుగు మొదటి స్థానం, ఎం తేజశ్రీ జావెలిన్ త్రో మొదటి స్థానం,పి అక్షిత లాంగ్ జెంప్ రెండవ స్థానము,ఎస్ ప్రసన్న లాంగ్ జెంప్ తృతీయ స్థానం,కె సుష్మ షాట్ పుట్ రెండవ స్థానం, వి ప్రవళిక తృతీయ స్థానం సాధించారు. గెలుపొందిన క్రీడాకారులు హనుమకొండ జిల్లా తరుపున రాష్ట్రస్థాయిలో పాల్గొంటారు.విజేతలుగా నిలిచిన క్రీడాకారులను,అదేవిధంగా వ్యాయమ ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటేష్, జగదీష్, లను కమలాపూర్ ఎంపీడీఓ జి బాబు అభినందించారు.

## 12న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

### జిల్లా కార్యదర్శి పార్వతి



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 10 (నినాదం):** సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటయు పాల్గొంటుందని యూనియన్ జిల్లా కార్యదర్శి బొందు పార్వతి, ఉపాధ్యక్షులు ఇంద్రపల్లి సైదమ్మ మంగళవారం విలేఖరులకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ పథకాలను రద్దు చేయాలని, నిర్వీర్యం చేసే ఆలోచన విరమించాలని వారు ఆరోపించారు. అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అదేవిధంగా కార్మికులకు ఇబ్బంది కర 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. అన్ని ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చాయని సమ్మెలో టీచర్లు, హెల్పర్లు పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి రషీద, సభ్యులు ప్రమీల, రజిత, అరుణ, ఉన్నారు.

## విద్యార్థులు ఇష్టంగా చదవాలి



**కమలాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం) :** విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని ప్రముఖ సైకాలజిస్ట్ అడిగ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డా జి అనిత ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రముఖ సైకాలజిస్ట్ వ్యక్తిత్వ వికాస నిపుణులు అడిగ శ్రీనివాస్ ప్రసంగించారు. ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు దగ్గరలో ఉన్నాయని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు.విషయాన్ని బట్టీ పట్టకుండా అర్థం చేసుకొని చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. సబ్జెక్టులను కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు.పరీక్షల సమయంలో విద్యార్థులు సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలిపారు.సోషల్ మీడియా ఇన్స్టాగ్రామ్ ఫేస్బుక్, వాట్సప్ మొదలగు వాటికి దూరంగా ఉండాలని అప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఇప్పటి నుండి విద్యార్థులందరూ పరీక్షలను ఒక దీక్ష లాగా తీసుకొని మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు ,పాల్గొన్నారు.

# అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలి

## ఎస్పీ శరత్ చంద్ర పవార్

**మిర్యాలగూడ ఫిబ్రవరి 10(నినాదం) :** మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ స్పష్టం చేశారు. మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన పోలీస్ సిబ్బంది బ్రీఫింగ్ సమావేశంలో పాల్గొని. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు మరియు పోలింగ్ రోజున సున్నిత ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అనుమానాస్పద వ్యక్తులు, గుంపులపై కఠిన నిఘా పెట్టాలని, అక్రమ మద్యం, నగదు, ఇతర ప్రలోభాలకు సంబంధించిన చర్యలను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని జిల్లా ఎస్పీ గారు భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐలు నాగభూషణ్, సోమ నర్సయ్య, పి.ఎన్.డి ప్రసాద్, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

## కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి ఫిబ్రవరి 10 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు.మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో ఏర్పాటుచేసిన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా సిబ్బందితో మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఎలాంటి తేడా లేకుండా నిర్వహించాలని, అన్ని విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు .బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పిఓ డైరీ జాగ్రత్తగా రాయాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ఉదయం 6:45 గంటలకు ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్ ను తెరవడం చేయాలన్నారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ నెల 11 న నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, జిల్లాలోని 6 మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, 161 వార్డులకు సంబంధించి 473 పోలింగ్ కేంద్రాలలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుందని హాలియా మున్సిపాలిటీ లోని 10 వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. 3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకొనున్నారని, ఇందుకుగాను ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించామని, ఓటరు చీటీలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సవ్యంగా నిర్వహించేందుకు సిబ్బందిని





నియమించడంతోపాటు, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిందని, డిఆర్సి కేంద్రాల ద్వారా పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు 2855 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోవడం జరుగుతున్నదని, వీరందరికీ శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. డిఆర్సి కేంద్రాల నుండి పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిబ్బందికి బస్సులు ఏర్పాటు చేసి పంపిస్తున్నట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించామని, గత మున్సిపల్ ఎన్నికల్లో 79.5% ఓట్లు పోల్ కాగా, ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో 89% ఓట్ల పోలయ్యాయని, పోలింగ్ ను పెంచేందుకు గాను అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని, ముఖ్యంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఆడియో క్లిప్ ద్వారా ఓటు వేసే విధంగా అవగాహన కల్పిస్తున్నామని, ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డులను చూపించి ఓటు వేసేలా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు .నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి ఆర్జాల భావి వద్ద ఉన్న ఎస్ డబ్ల్యుసి గోదాంలో నల్గొండ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, దేవరకొండ, చండూరు చిట్యాల మున్సిపాలిటీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఎస్ఎల్బీసీ సమీపంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హాలియా మున్సిపాలిటీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మిర్యాలగూడ అవంతిపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ చేర్పరు.సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికల ప్రచారం ముగిసినందున ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, వి ఎస్ టి బృందాలు చురుకుగా పనిచేస్తున్నాయని, ఎక్కడైనా డబ్బు, మద్యం పంపిణీ జరుగుతున్నట్లయితే తక్షణమే స్పందించి సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులను జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీ ఓటర్లు అందరూ వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో. స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,ఇతర అధికారులు ఉన్నారు.

# కొత్త సైబర్ మోసానికి పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

## పెట్రోల్ బంకులే వారి టార్గెట్

## ఇద్దరిపై పలు స్టేషన్లలో 9 కేసులు నమోదు




**కమలాపూర్, ఫిబ్రవరి 10 (నినాదం) :** పెట్రోల్ బంకులే లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కాజిపేట ఏ సి పి పింగిలి ప్రశాంత్ రెడ్డి తెలిపారు.మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ క్రెడిట్ కార్డులతో కొత్త సైబర్ మోసానికి పాల్పడుతున్న మహబూబాబాద్ పట్టణం రెడ్యానాయక్ కాలానికి చెందిన రాపోలు శ్రీనివాస్ (34), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ పట్టణం సర్పవరం జంక్షన్ కు చెందినచింతాడా సాయి కుమార్(22)లు ఈ నెల 3న,క్రెడిట్ కార్డుతో మోసం చేయాలని వరంగల్ నుండి హుజురాబాద్ వచ్చి అక్కడ నుండి ఆటో లో కమలాపూర్ కు ఒక పెట్రోల్ బంకులో డబ్బులు తీసుకొనే ప్రయత్నం చేశారు. కాని వారి దగ్గర డబ్బులు లేకపోవడంతో అదే దారిలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న జక్కు రాజు దగ్గరకు వచ్చి మాదగ్గర క్రెడిట్ కార్డు ఉంది దానితో బిల్లు కట్టుకోవాలన్నారు. రూ 50 వేలు ఇస్తే 2వేల రూ కమిషన్ఇవ్వాలని రాజు తెలిపారు.దాంతో వారు వెయ్యి రూ నగదు ఇచ్చి మరో వెయ్యి ఫోన్ పే చేస్తామని నమ్మకం కల్గించారు.కమిషన్ వస్తుంది అనుకున్న జక్కు రాజు తన ఫోన్ నుండి చింతాడా సాయి కుమార్ ఫోన్ కు (25000,20200,3200,300,300) ఐదు సార్లు కలిపి 49 వేల రూపాయలు పంపించాడు.రాపోలు శ్రీనివాస్ రాజుకు క్రెడిట్ కార్డు అని చెప్పి వేరే వారి పేరు మీద ఉన్న డెబిట్ కార్డు ఇచ్చి అక్కడ నుండి ఆటోలో వెళ్లి పోయారు.తర్వాత అనుమానం వచ్చిన రాజు వారి ఫోన్ నంబర్ కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో మోసానికి గురైనట్లు తెలుసుకున్న రాజు స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశాడు. దింతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా క్రెడిట్ కార్డులతో క్రొత్త సైబర్ మోసాలకు పాలడుతున్నట్లు అంగీకరించారని తెలిపారు.రాజు దగ్గర తీసుకున్న రూపాయలు బెట్టింగ్ యాప్ లలో పెట్టి పోగొట్టుకున్నారు. అదేవిధంగా విరిద్దరిపై ఈ కేసు తో పాటుగా పర్కాల, సుబేదారి, వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ల లో కూడా కేసులు ఉన్నాయని సాయి కుమార్, రాపోలు శ్రీనివాస్ లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎ సి పి తెలిపారు. కొత్త వ్యక్తుల వద్ద జాగ్రత్తగా ఉండాలని ఎలాంటి అనుమానాలు ఉన్నా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయాలని కోరారు.ఈ కేసును ఛేదించిన స్థానిక సి ఐ నవీన్, ఎస్సై దిలీప్, కానిస్టేబుళు ఉదయ్, భాస్కర్ లను ఎ సి పి ప్రశాంత్ రెడ్డి అభినందించారు.

# మున్సిపోల్స్ నిర్వహణకు భద్రతా ఏర్పాట్లు పూర్తి..





## 450 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

## ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు

## ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా మరియు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, తెలిపారు. అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో బ్రీఫింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రాముఖ్యత, విధుల నిర్వహణలో పాటించాల్సిన నియమాలు, సిబ్బంది చేయవలసిన మరియు చేయకూడని అంశాలపై సమగ్రంగా వివరించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో 26 లొకేషన్స్ ఉన్నాయని తెలిపారు. ఎన్నికల భద్రత కోసం 450 మంది పోలీసు సిబ్బందిని నియమించడం జరిగిందని, పోలింగ్ సామగ్రిని పటిష్ట ఎస్కార్ట్‌తో తరలించేందుకు 8 రూట్లలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి రెండు రూట్లకు ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి తో పాటు స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రతి నాలుగు రూట్లకు డీఎస్పీ స్థాయి అధికారితో పాటు స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, అదనంగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, సీఐల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్, ఎస్ఐల ఆధ్వర్యంలో పెట్రోలింగ్ టీమ్స్, రూట్ మొబైల్స్ బ్లూ కోర్ట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఒక అడిషనల్ ఎస్పీ, ముగ్గురు డిఎస్పీలు, పది మంది సిఐలు, 30 మంది ఎస్సైలు, మిగతా పోలీస్ సిబ్బంది ఉన్నట్లు వివరించారు. ఎన్నికల సందర్భంగా పోలీసుల విధి విధానాలపై స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చినట్లు తెలిపారు. పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా, ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సెల్ ఫోన్లు,ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకువెళ్లడం నిషేధమని, పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ, సిఐలు ఆర్ఐ, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పైప్‌లైన్ కబ్జాపై అధికారుల పరిశీలన



**మహాదేవపూర్, ఫిబ్రవరి 10, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో 582 సర్వే నెంబర్ లో పైప్ లైన్ కబ్జాకు గురైందని ఆరోపణలపై మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామ పంచాయితీ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని భాగమైన ఎర్ర చెరువు రిజర్వాయర్ నుండి మందరం చెరువు కు లింకు కలిపే ఇరిగేషన్ పైపులైను కబ్జాకు గురికావడం పట్ల అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామారావు, డిప్యూటీ తాసిల్దార్ యూసుఫ్, ఇరిగేషన్ ఏఈ భరత్, సర్వేయర్ రాజా రమేష్, కార్యదర్శి కల్పన తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ విధానంతో లాభం ఎవరికీ..?



**కోదాడ, ఫిబ్రవరి 10 (నినాదం):** యూరియాను యాప్ ద్వారా మాత్రమే రైతులకు అందిస్తున్న ప్రభుత్వ విధానంపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు సాంకేతిక అడ్డంకులు శాపంగా మారుతున్నాయని అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామానికి చెందిన రైతు బుచ్చిరాములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ...స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్, యాప్ వినియోగం తెలియని వేలాది మంది చిన్న, సన్నకారు రైతులు యూరియా కోసం సొసైటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది అన్నారు.. ఈ విధానం వల్ల లాభం ఎవరికీ దక్కుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిజంగా రైతన్నకే లాభమా..? లేక యాప్ వ్యవస్థను నియంత్రిస్తున్న అధికారులకు, మధ్యవర్తులకు, వ్యాపారులకు ప్రయోజనమా..? అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయనీ ఆయన ఆరోపించారు. పంటలు ఎండిపోతున్న వేళ యూరియా కోసం యాప్‌తో పోరాటం చేయాల్సిన పరిస్థితి దారుణమని పేర్కొన్నారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 10 (నినాదం):** మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బి జె ఆర్ నగర్ బస్తీ దవాఖాన వద్ద మంగళవారం సుమారు 20 లక్షల రూపాయల వ్యయం తో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్, సెక్రటరీ నర్సింగ్ రావు, ఆంటోనీ, నవీన్, మహబూబ్, నవీన్, సత్యనారాయణ, ఈశ్వర్, కృష్ణ స్వామి, సంతోష్, రాజు, మోహన్, రఘు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి






## కలెక్టర్ రాహుల్‌శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** పురపాలక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, మున్సిపల్ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మైదానంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి అంబేద్కర్ స్టేడియంలోని బ్యాలెట్ బాక్స్ లు నిల్వచేయడానికి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ ఓట్లు లెక్కింపు కొరకు ఏర్పాటు చేయనున్న సింగరేణి మినీ ఫంక్షన్స్ హాల్ ను పరిశీలించి కౌంటర్లు ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న అంశంపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ లో 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఓటర్లు నిర్భయంగా రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును వినియోగించుకావాలని సూచించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉండగా 86 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పిఓలు, ఏపీవోలు, ఓపివోలు కు ఎన్నికల నిబంధన ప్రకారం శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోనా, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెంత.. దిగజారుతావ్...!




### జెండా లేదు.. కండువా లేదు..,!

### కలగూర పార్టీ పొందుతో కంపు కంపు

**జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 10 (నినాదం):** జమిందారు కుటుంబం నీది..న్యాయం కోసం కొట్లాడే తండ్రికి తనయుడివి.. ఉన్నతమైన వృత్తిలో నుంచి రాజకీయ అరంగేట్రం చేస్తివి. ఉద్యమాల గడ్డమీద్ద మరో రాజకీయ నాయకుడు ఎదుగుతున్నందుకు జగిత్యాల ప్రజలు సంతశించిరి. కావాల్సినంత సంపద ఉండె, అయ్యా భాంచన్ అంటూ ఇంటి వాకిలి తొక్కే ప్రజలకు సహాయం చేసే సామర్థ్యం మీది, కులం పార్టీలో నుంచి చట్ట సభలకు వెళ్లి ఈ ప్రాంత చైతన్యానికి ఊపిర్లు ఊదుతావని ఉహించిరి. ఇంతలో ఏమాయే.... అధికారం లేకపోతె బతుకలేని దౌర్భాగ్యపు దుస్థితికి చేరితివి. రాజకీయ భిక్ష పెట్టిన పార్టీకి వెన్నుపోటు పొడిస్తివి. గాలి పదవుల కోసం కరెన్సీ కట్టల కోసం జగిత్యాల గడ్డ మీదికి రాజకీయా వ్యభిచారాన్ని మోసుకు వస్తివి.పూటకో పార్టీ మార్చే ఊసరవెల్లి వని పేరుకు దగ్గరైతివి. ఎవరి మాయలో పడి ఇంతకు దిగజారితివి. కన్న తండ్రి బతికుంటే కలత చెంది కన్ను మూస్తుండే, నిజాయతి గల రాజకీయ నాయకుడిగా ఎదుగాక పోయిన పర్వాలేదు, అడ్డ దారిలో వెళ్లి కాంట్రాక్ట్ పనులకు కమిషన్లకు అలవాటు పడి నువ్వు దిగజారిందే గాక ఈ ప్రాంత చైతన్యానికి మచ్చ తెచ్చితివి. ఇది నీకు పుట్టిన బుద్దేనా, వియ్యకుండు అవినీతితో కలిపి పెట్టిన సద్దేనా? తాను చెడి నీవెనుక ఉన్న పరివారాన్ని కూడా చెరిచి గాలి వాటు రాజకీయాలతో ఊరేగుతున్నావ్. సంపదపై నువ్వెంచుకున్న ప్రేమ నిన్నెప్పటికైనా పదవి భ్రష్టున్ని చేసి జగిత్యాల గడ్డమీద దోషిగా నిలబెడుతుంది. పరాయి పాపపు ఆలోచనలకు పురుడు పోస్తూ కడుతున్న మూటలు, ఉన్నతమైన నీ కుటుంబ నేపథ్యాన్ని మురుగు కాలువలోకి దించింది. విమర్శలు పట్టించుకోకపోయినా పర్వా లేదు, నైతిక విలువలు లేకపోతె, నడవడికనే ప్రశ్నార్ధకం అవుతుంది. రాజకీయ పదవులు, చట్ట సభకు వెళ్లే హోదాలు, డబ్బుతో కొనగలననే తప్పుడు ఆలోచనలకు తగిన శాస్తి ప్రజాక్షేత్రంలో దొరుకుతుంది. జెండా ఎజెండా లేని, నీ రాజకీయ వ్యాపార వ్యభిచారాన్ని నీకు ఓటేసే ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారు. చైతన్యల గడ్డకు మకిలీ పట్టించిన నీకు సంప్రోక్షణ అత్యవసరమని జగిత్యాల ప్రజలు గమనించారు. బాధ పడకు ఇప్పటికైనా విలువ గల రాజకీయ ఓనమాలు దిద్దుకో.... జగిత్యాల గడ్డ ఋణం తీర్చుకో.. అభివృద్ధి చేయకపోయినా పర్వాలేదు.. జగిత్యాలకు అప్రతిష్ట మూట కట్టకు...

# సజావుగా ఎన్నికల నిర్వహణ

### చెక్ లిస్ట్ చూసుకోవాలి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, ఫిబ్రవరి 10(నినాదం) :** నేడు మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు మంగళవారం వికారాబాద్ జిల్లా మేరీ నాట్ పాఠశాల నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ల ను పరిశీలించారు. నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను ,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణి ని పరిశీలించారు. పాఠశాలలో ఆవరణలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్ ని చెక్ చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పా ట్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వెళ్లి ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారి గా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు, బాక్స్ లు జాగ్రత్త గా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలి పారు. డిస్ట్రి బ్యూ షన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏ ర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజ నం కల్పించాలని విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పా ర్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.రూట్ల ల వారీగా బస్సు లు బయలుదేరే విధంగా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు.

# కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎంకి ఆహ్వానం



### ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ

**కీసర సర్కిల్, కీసరగుట్ట, ఫిబ్రవరి10, (నినాదం) :** కీసర సర్కిల్ , కీసరగుట్ట, మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట శ్రీ భవాని శివ దుర్గా సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ.. దేవాలయ శాఖ మంత్రి కొండ సురేఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన నివాసంలో ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, ఈవో కట్ట సుధాకర్ రెడ్డి కలిపి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫెడ్-2026 క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

### ఆయిల్ ఫామ్ సాగుతోనే రైతులకు భరోసా



**దమ్మపేట, ఫిబ్రవరి 10(నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం గండుగులపల్లి లోని మంత్రి నివాసంలో ఆయిల్ ఫెడ్ అధికారులతో కలిసి ఆయిల్ ఫెడ్-2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగును వేగంగా ముందుకు తీసుకెళ్లి, తెలంగాణను దేశానికే ఆయిల్ హబ్ గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు మేలు చేసే పలు కీలక అంశాలను వెల్లడించారు. ఇతర సంప్రదాయ పంటల కంటే ఆయిల్ పామ్ సాగు అత్యంత లాభదాయకమని, రైతులు ఎకరాకు రూ. లక్ష వరకు నికర ఆదాయం పొందే వీలుందని మంత్రి వివరించారు. సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో దీనిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అలాగే నిజామాబాద్ జిల్లాలోని కేశపూర్ కొత్త యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని ఆశించిన రీతిలో పెంచకపోవడం దురదృష్టకరమని, దీనివల్ల స్వదేశీ రైతులకు నష్టం వాటిల్లుతుందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు, సాగు ఖర్చును తగ్గించేందుకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని 2026 నుంచి మరింత బలోపేతం చేస్తామని, డ్రిప్ ఇరిగేషన్ కోసం సబ్సిడీలను సక్రమంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఆయిల్ ఫెడ్ అధికారులు నాగబాబు, కార్తీక్, రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్, కె.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిని నిర్లక్ష్యం చేసినవారే ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు

### మంత్రి లక్ష్మణ్ కుమార్ ఫైర్



**ధర్మపురి ఫిబ్రవరి 10(నినాదం) :** అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెట్టడం కాంగ్రెస్‌కు తెలియదని, కానీ గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో అదే జరిగింది అంటూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ధర్మపురి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన ప్రత్యర్థులపై ఘాటుగా స్పందించారు. "మా పాలనలో ఒక్కరిపై కూడా అధికార దుర్వినియోగం చేయలేదు. కానీ బీఆర్ఎస్ హయాంలో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కి, పోలీసులు, అధికారులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాలపై కేసులు పెట్టించారనే విషయం అందరికీ తెలిసిందే" అని మంత్రి విమర్శించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఏకగ్రీవాల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఎలా ఖూనీ చేశారో ప్రజలు మరచిపోలేదన్నారు. సోషల్ మీడియాలో అభిప్రాయం చెప్పడానికే ప్రజలు భయపడే పరిస్థితి తీసుకువచ్చిందీ అదే ప్రభుత్వం అని అన్నారు. గతంలో మంత్రి పదవిలో ఉన్నప్పటికీ ధర్మపురికి నిధులు తీసుకురాలేని నాయకులు ఇప్పుడు అభివృద్ధి పేరుతో మాట్లాడటం విచిత్రమన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతే నైట్ కాలేజీ తిరిగి ప్రారంభమైందని, అభివృద్ధి పనులకు నిధులు వచ్చాయని గుర్తుచేశారు. పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ప్రశ్నించిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 700 కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చామని, డిగ్రీ కళాశాల, ఐటీఐ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామని చెప్పారు. కాళేశ్వరం పేరుతో ప్రజాధనం వృథా చేశారని, ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా ప్రభుత్వం హామీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించలేదని, ఓటమి భయంతో బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. రోడ్లు, హాస్టళ్లు, విద్యాసంస్థలు, సాగునీటి పనులు ఇవన్నీ ప్రజల అవసరాల కోసమే చేస్తున్నామని, ధర్మపురి అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చివరగా, ధర్మపురి మున్సిపాలిటీలో అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను మంత్రి కోరారు.

NINADAM CINEMA

# కొచ్చైడైయాన్ నిర్మాతకు మద్రాస్ హైకోర్టు నోటీసులు

### యాడ్ బ్యూరోకు రెండున్నర కోట్లు చెల్లించాలని ఆదేశం




చెక్ బౌన్స్ కేసులో 'కొచ్చడైయాన్' సినిమా (తెలుగులో 'విక్రమ సింహ') నిర్మాతకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యాడ్ బ్యూరో సంస్థకు నాలుగు వారాల్లో రూ.2.5కోట్లు చెల్లించాలని లేదంటే ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. రజనీకాంత్ కథానాయ కుడిగా ఆయన కుమార్తె సౌందర్య దర్శకత్వంలో 2014లో వచ్చిన 3డీ మోషన్ క్యాప్చర్ మూవీ 'కొచ్చడైయాన్'. దీపిక పదుకొణె కథానాయిక. ఈ సినిమా నిర్మాణ పనులకు బెంగళూరుకి చెందిన యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మీడియా వన్ గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ డైరెక్టర్లలో ఒకరైన మురళీమనోహర్ రుణం తీసుకున్నారు. తిరిగి చెల్లింపుల్లో భాగంగా 2014లో మురళీమనోహర్ యాడ్ బ్యూరో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అబిర్ చంద్ నహర్‌కు రూ.5 కోట్ల చెక్ ఇచ్చారు. అది బౌన్స్ కావడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. మొదట ఈ కేసులో మురళీ మనోహర్‌కు ట్రయిల్ కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆయన మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఇచ్చిన గడువులోపు యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.2.5 కోట్లు చెల్లించాలని లేదంటే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆదేశించింది.

# వారణాసిలో ప్రియాంక పాత్ర

### రాజమౌళి సినిమాలంటే ఇష్టమన్న నిక్




ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా నటిస్తోన్న చిత్రం 'వారణాసి'లో ప్రియాంక చోప్రా.. మందాకిని అనే ప్రధాన పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రియాంక ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై ఆమె భర్త నిక్ జోనస్ మొదటిసారి స్పందించారు. ఈ సినిమా గురించి ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తను 14 నెలల నుంచి ఓ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. 'ఆర్ఆర్ఆర్' లాంటి గొప్ప చిత్రాన్ని రూపొందించిన రాజమౌళి దీన్ని రూపొందిస్తున్నారు. ఆయన నుంచి వస్తోన్న మరో భారీ చిత్రమిది. అద్భుతంగా ఉండనుందని నమ్ముతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిక్ భారతీయ చిత్రాల గురించి మాట్లాడారు. తనకు ఇండియన్ సినిమాలు అంటే ఎంతో ఇష్టమన్నారు. గొప్ప చిత్రాలు ఉన్నాయని కొనియాడారు. భారతీయ సంగీతమన్నా అభిమానమన్నారు. భారత్‌లో ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఉందని అది తనకు చాలా ఇష్టమన్నారు. ఏదైనా వేడుక జరిగినప్పుడు అందరూ కలిసి సరదాగా ఉంటారని తెలిపారు. 'వారణాసి' విషయానికొస్తే.. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

# బాలీవుడ్‌లోకి కిరణ్ అబ్బవరం



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో మరో భారీ అడుగు వేయబోతున్నారు. 'క' చిత్రంతో పాన్-ఇండియా స్థాయిలో తన సత్తా చాటిన కిరణ్, ఇప్పుడు బాలీవుడ్ ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా నిర్మాణంలో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు తెలుస్తుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్‌తో కలిసి ప్రేరణ అరోరా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా, కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ సంస్కృతి మరియు పురాణాల నేపథ్యంలో సాగే ఒక అద్భుతమైన మైథాలజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా కోసం మేకర్స్ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించబోతున్నారు. గ్రాండ్ విజువల్స్ మరియు హై టెక్నికల్ వాల్యూస్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ నెల నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని చిత్ర బృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ లేదా టాలీవుడ్‌కు చెందిన ఒక అగ్ర నటిని హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్రక్రియలో చిత్ర యూనిట్ ఉంది. భక్తి, భావోద్వేగాలు, డ్రామా మరియు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌ల కలయికతో ఈ కథ ఉండబోతోందని, ప్రేక్షకులకు ఇది ఒక సరికొత్త దృశ్యకావ్యాన్ని అందిస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సినిమా టైటిల్, దర్శకుడు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. 'క' సినిమా విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కిరణ్ అబ్బవరం, ఈ గ్లోబల్ ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద తనదైన ముద్ర వేయాలని సిద్ధమవుతున్నారు.

# నెటిజన్ అసభ్యకర ప్రశ్నపై స్పందించిన కామాక్షి భాస్కర్ల..

### మనుషులుగా గుర్తించాలంటూ పోస్ట్



టాలీవుడ్ యంగ్ బ్యూటీ, 'మా ఊరి పొలిమేర' ఫేమ్ కామాక్షి భాస్కర్ల సోషల్ మీడియాలో తనపై వచ్చిన ఒక అసభ్యకరమైన ప్రశ్నకు అత్యంత చాకచక్యంగా సమాధానం ఇచ్చి వార్తల్లో నిలిచింది. సాధారణంగా సెలబ్రిటీలు ఇలాంటి చిల్లర ప్రశ్నలను పట్టించుకోరు, కానీ కామాక్షి ఒక అడుగు ముందుకు వేసి సదరు నెటిజన్‌కు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. "అందమైన అమ్మాయిలు అసలు పూప్ (మల విసర్జన) చేస్తారా?" అని ఒక నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించిన తీరు ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. వృత్తిరీత్యా నటి మాత్రమే కాకుండా డాక్టర్ కూడా అయిన కామాక్షి ఈ ప్రశ్నకు స్పందిస్తూ.. "మా కడుపులు సిమెంట్, కాంక్రీటుతో తయారయ్యాయి. అందుకే మేము తినే ఆహారం అంతా మాయమైపోతుంది. అది నేరుగా ఆర్గానిక్ ఫార్మింగ్‌కు ఉపయోగపడుతుంది" అంటూ తనదైన శైలిలో సెటైర్ వేసింది. సెలబ్రిటీలు కూడా సాధారణ మనుషులే అన్న విషయాన్ని మర్చిపోయి ఇలాంటి విడ్డూరమైన ప్రశ్నలు అడిగే వారికి తనదైన వ్యంగ్యంతో సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. సైన్స్‌తో సంబంధం లేని ఇలాంటి ప్రశ్నలకు తన హాస్యం తోడైతేనే కరెక్ట్ అని ఆమె నిరూపించింది. అంతేకాకుండా ఈ వీడియోకు.. "కొన్నిసార్లు ఇంటర్నెట్ చాలా సీరియస్ ప్రశ్నలు అడుగుతుంటుంది. వాటికి సైన్స్ నుంచి సమాధానాలు ఆశిస్తుంది. కాస్త వ్యంగ్యం, కాస్త హాస్యం కలిపి చెప్పడం ద్వారా సెలబ్రిటీలు కూడా సాధారణ రక్తమాంసాలున్న మనుషులే అని గుర్తు చేయడానికే నేను ఇలా స్పందించాను" అని రాసుకొచ్చింది. ప్రస్తుతం 'మా ఊరి పొలిమేర-3' చిత్రంతో బిజీగా ఉన్న కామాక్షి, ఇలాంటి అసభ్యకర ప్రశ్నలను సున్నితంగా స్పందించడమే కాకుండా కౌంటర్ ఇవ్వడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.




# విశ్వంభరకు ప్రత్యేకంగా టైటిల్ కార్డ్స్

మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట కాంబినేషన్‌లో రాబోతున్న సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టైటిల్ కార్డ్స్ విషయంలో దర్శకుడు వశిష్ట తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'లియో' సినిమా తర్వాత యానిమేటెడ్ టైటిల్ కార్డ్స్ వేయడం అనేది ఒక ట్రెండ్‌గా మారిపోయిందన్న సంగతి తెలిసిందే, అయితే తన సినిమా కోసం ఆ రొటీన్ ఫార్ములాను ఫాలో అవ్వడం తమకు ఇష్టం లేదని వశిష్ట క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ 'విశ్వంభర' కాన్సెప్ట్‌ను ప్రతిబింబించేలా ఏకంగా ఎనిమిది రకాల ప్రత్యేకమైన మెగాస్టార్ టైటిల్ కార్డ్ డిజైన్స్‌ను చిత్ర బృందం రూపొందించినట్లు తెలుస్తుంది. పంచభూతాల నేపథ్యంలో సాగే ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ప్రతి టైటిల్ కార్డ్ ఒక ప్రత్యేకమైన ఎలిమెంట్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో, చిరంజీవి ఇమేజ్‌ను మరో లెవల్‌లో చూపిస్తూ ఈ కార్డ్స్ డిజైన్ చేయబడ్డాయి. కేవలం టైటిల్ కార్డ్స్ కోసమే దర్శకుడు ఇంతటి కసరత్తు చేశారంటే, వెండితెరపై సినిమా ఏ స్థాయి విజువల్ వండర్‌గా ఉండబోతుం దోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# జోర్డాన్‌లో డ్రాగన్ యాక్షన్ సీన్స్ షూటింగ్



టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్-డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' సినిమాపై అభిమానుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ జోర్డాన్‌లో జరుగుతోంది. అక్కడ ఎన్టీఆర్‌పై అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ యాక్షన్ ఎపిసోడ్ పూర్తయిన వెంటనే ఓ స్పెషల్ సాంగ్‌ను షూట్ చేయనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆ పాటలో ఎన్టీఆర్ స్టెప్స్‌తో పాటు హీరోయిన్ రుక్మిణీ వసంత్ గ్లామర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సాంగ్‌ను కూడా గ్రాండ్ లెవల్‌లో తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలిచే అవకాశముంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని యూనిట్ చెబుతోంది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా నిలవాలని ప్రశాంత్ నీల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడని సమాచారం. అందుకే స్క్రిప్ట్ దశలోనే ఆయన చాలా సమయం కేటాయించాడట. కథ, స్క్రీన్‌ప్లే, యాక్షన్ బ్లాక్స్ అన్నింటినీ అత్యంత జాగ్రత్తగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787